తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
26-05-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 110
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# ఆకునూరి రూటే సెపరేటు!

నాడు కేసీఆర్ సర్కార్..
నేడు రేవంత్ ప్రభుత్వం



ఉన్నది ఉన్నట్టు కుండ బద్దలు కొట్టాల్సిందే..
ప్రభుత్వాలతో వివాదాలు కొత్తేమీ కాదు
విద్యా కమిషన్ చైర్మన్ రాజీనామా వెనుక అసలు కథ ఏంటి?
'విద్యా' వివాదమా? 'ముఖ్య నేత' ఆగ్రహమా?
టీచర్ల జీతాలు తగ్గించాలన్న సిఫార్సులపై భారీ వ్యతిరేకత
కేకే కమిటీ ఏర్పాటుతో విద్యా కమిషన్ ప్రాధాన్యత పూర్తిగా కట్
మురళి స్వయంగా స్పందిస్తేనే అసలు నిజాలు బయటపడేది

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఉన్నట్టుండి తన పదవికి రాజీనామా చేయడం అటు ప్రభుత్వంలో, ఇటు విద్యా శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. ఎలాంటి సంకేతాలు లేకుండా ఆయన తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపడం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం అప్పగించిన పని పూర్తి కావడం వల్లే తాను తప్పుకుంటున్నానని మురళి లేఖలో పేర్కొన్నప్పటికీ.. ఆయన పదవీ కాలం ఇంకా నాలుగు నెలలు ఉండగానే రాజీనామా చేయడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయనే చర్చ నడుస్తోంది. అసలు

మిగతా 2వ పేజీలో..



# హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల భారీ రీఫైనాన్సింగ్!

- ఐఆర్ఎఫ్‌సీతో కీలక రుణ ఒప్పందం కుదుర్చుకున్న మెట్రో సంస్థ
- పట్టణ రవాణా విస్తరణకు దీర్ఘకాలిక ఆర్థిక బలం
- మెట్రో విస్తరణ ప్రణాళికలకు రానున్న కొత్త ఊపు
- అధిక వడ్డీ రుణాల స్థానంలో తక్కువ వ్యయ ఫైనాన్సింగ్
- ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వానికి భారీ ఊరట కలగనున్నది
- రోజుకు ఐదు లక్షల మందికి సేవలందిస్తున్న మెట్రో
- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా అడుగు
- కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో కీలక ఒప్పందం విజయవంతం

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:**
తెలంగాణ రవాణా వ్యవస్థలో మరో కీలక ఘట్టం నమోదైంది. హైదరాబాద్ నగర పట్టణ రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గరిష్ఠంగా రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ రుణం లభించింది. ఈ మేరకు ఢిల్లీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మధ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ, సీఈఓ మనోజ్ కుమార్ దుబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో

మిగతా 2వ పేజీలో..

# కాళేశ్వరంలో భక్తుల సందడి

- వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలతో కిక్కిరిసిన ఘాట్లు
- పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు

3





# టీజీఎస్పీడీసీఎల్ లో చెట్ల కొమ్మల తొలగింపుకు ఆధునిక యంత్రాలు

- విద్యుత్ అంతరాయాలు తగ్గించడమే లక్ష్యం
- జీహెచ్ఎంసీతో సమన్వయం చేసుకుని కొమ్మల తొలగించాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్
- జూబ్లీహిల్స్‌లో పనులను పరిశీలన

2



# ఉగ్రదాడుల్లో శిక్షణ ఇవ్వండి

ఉగ్రమూకలతో చాటింగ్
మేడ్చల్ పోలీసులకు పట్టుబడ్డ జాహెద్ ఖాన్
బొమ్మ తుపాకులతో రీల్స్
తుపాకుల కోసం ఇన్స్టా గ్రూప్లో వెతికిన జాహెద్
ఐఎస్ఐకు దేశభద్రతకు సంబంధించిన సమాచారం
పాక్ ఉగ్రవాదితో చాటింగ్
కీలక సమాచారం రాబట్టిన పోలీస్ శాఖ

**తెలంగాణ బ్యూరో**
తెలంగాణలో మరో ఉగ్రవాది అరెస్ట్ కలకలం లేపింది. దేశంలో ఎక్కడ ఉగ్రవాది పట్టుబడ్డ హైద్రాబాదుతో లింకులు వస్తుంటాయి.కానీ ఓ వ్యక్తి హైదరాబాద్ శివారులో ఉంటూ పాక్ ఉగ్రవాదులతో తరచూ మాట్లాడుతుండటం, తుపాకుల కోసం ఆన్లైన్ సెర్చ్ చేయడం వంటి కార్యకలాపాలు ఇంటెలిజెన్స్

మిగతా 3వ పేజీలో..

# "ఒక్క ఇందిరమ్మ ఇల్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా"



- హైడ్రాతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- 420 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్
- 2028లో మళ్లీ కేసీఆర్‌దే అధికారం అంటూ ధీమా
- జూన్ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

2



# భగ్గుమంటున్న తెలంగాణ

2

- రోహిణీ కార్తె ఎఫెక్ట్‌తో 46.5 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- కుమురం భీం నుంచి సూర్యాపేట వరకు రెడ్ అలర్ట్ పరిస్థితి

# ధాన్యం నిల్వలపై ఆకస్మిక తనిఖీలు

- రైస్ మిల్లులపై మంత్రి ఆగ్రహం
- రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
- మిల్లులు, గోదాముల వద్ద పోలీసు నిఘా

3





# రైతు గోస బీజేపీ భరోసా

- గజ్వేల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్న నాయకులు
- పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకులు

2

# మోదీ క్యాబినెట్‌లో కిషన్ రెడ్డి మార్క్..

- పనితీరులో దేశంలోనే నంబర్ 1 మంత్రిగా రికార్డ్!



**తెలంగాణ బ్యూరో, మే 25 :**
కేంద్ర ప్రభుత్వంలో తెలుగు నేతలు తమదైన ముద్ర వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర

మిగతా 2వ పేజీలో..

# హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల భారీ రీఫైనాన్సింగ్!

**మొదటిపేజీ తరువాయి**

మెట్రోను మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగానే ఈ కీలక ఆర్థిక ఒప్పందం కుదిరిందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సమర్థవంతమైన, సుస్థిరమైన, ప్రజానుకూల రవాణా వ్యవస్థ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక నగరంగా ఎదుగుతోందని, వేగవంతమైన పట్టణ విస్తరణకు అనుగుణంగా మెట్రో కనెక్టివిటీ విస్తరణ అత్యంత అవసరమని చెప్పారు. నగర ట్రాఫిక్ రద్దీ తగ్గించడంలో, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో మెట్రో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ వల్ల ప్రాజెక్టుకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని, దీని ద్వారా మెట్రో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుందని తెలిపారు. ప్రస్తుత రుణభారం తగ్గడంతో పాటు భవిష్యత్ మెట్రో విస్తరణ ప్రణాళికలకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ రుణ సౌకర్యాన్ని నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ క్యాపిటల్ రీఫైనాన్సింగ్ వంటి అవసరాలకు వినియోగించనున్నారు. ఈ రుణాన్ని ఇరవై సంవత్సరాల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో రూపొందించారు. ప్రస్తుతం ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వ్యయంతో కూడిన దీర్ఘకాలిక రూపాయి ఫైనాన్సింగ్‌తో భర్తీ చేయనున్నారు. దీంతో ప్రాజెక్టు ఆర్థిక నిర్వహణ మరింత సులభతరం కానుంది. ఈ లావాదేవీకి తెలంగాణ ప్రభుత్వ నిర్బంధ చెల్లింపు హామీ, రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ, రిజర్వ్ బ్యాంకు మద్దతుతో డైరెక్ట్ డెబిట్ మాండేట్ వంటి బలమైన క్రెడిట్ వ్యవస్థ మద్దతుగా నిలిచాయి. దీంతో రుణదాతలకు భద్రతతో పాటు ప్రాజెక్టుపై విశ్వాసం పెరిగినట్లు అధికారులు తెలిపారు. 69.2 కిలోమీటర్ల పొడవుతో మూడు కారిడార్లు, 57 స్టేషన్లతో నిర్మితమైన హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ దేశంలో పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసిన అతిపెద్ద మెట్రో ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఈ మెట్రో నెట్‌వర్క్ ద్వారా రోజుకు ఐదు లక్షల మందికి పైగా ప్రయాణికులు సేవలు పొందుతున్నారు. ఈ రీఫైనాన్సింగ్ వల్ల భవిష్యత్‌లో కొత్త కారిడార్లు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ, చివరి మైలు రవాణా సదుపాయాల విస్తరణకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. హైదరాబాద్ మెట్రో భవిష్యత్ విస్తరణలకు ఇది బలమైన ఆర్థిక పునాది అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సుస్థిరమైన, సమర్థవంతమైన, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థ నిర్మాణంలో ఈ ఒప్పందం కీలక ముందడుగుగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్, ఎల్ అండ్ టీ మెట్రో ప్రతినిధులు, ఐఆర్‌ఎఫ్‌సీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోదీ క్యాబినెట్‌లో కిషన్ రెడ్డి మార్క్..

**మొదటిపేజీ తరువాయి**

మంత్రివర్గంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మంత్రుల జాబితాలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి అధికారికంగా విడుదల చేసిన తాజా ర్యాంకుల్లో కిషన్ రెడ్డి కి ప్రథమ స్థానం దక్కింది. మంత్రుల పనితీరు, ఫైళ్ల క్లియరెన్స్ వేగం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలతో అనుసంధానం వంటి కీలక అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకులను కేటాయించారు.

**పనితీరుకు నిదర్శనం ఈ ర్యాంక్**

బొగ్గు , గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కిషన్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. శాఖాపరమైన నిర్ణయాల్లో వేగం పెంచడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను అత్యంత వేగంగా పరిష్కరించడం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడంలో ఆయన చూపిన చొరవను కేంద్రం గుర్తించింది. ఈ ర్యాంకింగ్స్‌లో కిషన్ రెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా టాప్ పెర్ఫార్మర్ల జాబితాలో నిలిచారు.

**విష్ణువర్ధన్ రెడ్డి అభినందనలు**

కిషన్ రెడ్డికి అగ్రస్థానం దక్కడంపై ఏపీ బీజేపీ సీనియర్ నేత, జాతీయ కౌన్సిల్ సభ్యుడు యస్. విష్ణువర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి నిబద్ధత, నిజాయితీ వల్లే ఈ గుర్తింపు లభించిందని, ఇది తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. మోదీ టీంలో నంబర్ వన్ మంత్రిగా నిలవడం ఆయన సమర్థతకు నిదర్శనమని కొనియాడారు.

**రిపోర్టులోని ముఖ్యాంశాలు**

ఈ రిపోర్టు ప్రధానంగా డిజిటల్ ఫైల్ మూవ్‌మెంట్, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, మినిస్ట్రీ అవుట్‌పుట్ ఆధారంగా రూపొందించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే తన శాఖను దేశంలోనే ముందంజలో ఉంచిన కిషన్ రెడ్డిపై రాజకీయ వర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

# టీజీఎస్పీడీసీఎల్ లో చెట్ల కొమ్మల తొలగింపుకు ఆధునిక యంత్రాలు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ పరిధిలో జరుగుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ సోమవారం పరిశీలించారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో ఉన్న 11కేవీ అయ్యన్న ఫీడర్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన సీఎండీ, ఫీల్డ్ సిబ్బంది వినియోగిస్తున్న బ్యాటరీ ఆధారిత చెట్ల కొమ్మల కత్తిరింపు యంత్రాలు, మొబైల్ బకెట్ ల్యాడర్ల పనితీరును దగ్గరుండి గమనించారు. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ యంత్రాలతో పోలిస్తే కొత్త బ్యాటరీ యంత్రాల పనితీరు ఎలా ఉందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ సిబ్బంది మాట్లాడుతూ బ్యాటరీ యంత్రాలతో పని సులభంగా జరుగుతోందని, శబ్ద కాలుష్యం తక్కువగా ఉండటంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతున్నాయని తెలిపారు. అలాగే వీటిని సులభంగా ఒకచోటినుంచి మరోచోటికి తరలించవచ్చని పేర్కొన్నారు. పనులు వేగంగా, సురక్షితంగా పూర్తి చేసి విద్యుత్ అంతరాయాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీఎండీ అధికారులను ఆదేశించారు. చెట్ల కొమ్మలు తొలగించిన తర్వాత వాటిని రోడ్లపై వదిలేయకుండా వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని డంప్ యార్డులకు తరలించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యుత్ శాఖలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా పనితీరు మెరుగుపర్చడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. సీఎండీ పర్యటనలో డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింలు,, సీఈ మెట్రోజోన్ బిక్షపతితో పాటు ఎస్‌ఈ బంజారాహిల్స్, డీఈ బంజారాహిల్స్ పాల్గొన్నారు.



# ‘ఆకునూరి’ రూటే సెపరేటు!

**మొదటిపేజీ తరువాయి**

ఆ మాజీ ఐఏఎస్ అధికారి తన పదవికి ఉన్నఫళంగా ఎందుకు రాజీనామా చేశారు? ముఖ్య నేత సీరియస్ అవ్వడమే కారణమా? లేక ప్రభుత్వం తన సిఫార్సులను పట్టించుకోవడం లేదని ఆయనే అసహనానికి గురయ్యారా? అనే కోణాల్లో విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

**వివాదాస్పద సిఫార్సులు!**

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ హోదాలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఆకునూరి మురళి భావించారు. అందుకోసం ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యను అందిస్తున్న పలు దేశాలతో పాటు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి భారీ నివేదికను తయారు చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి 9 నివేదికల ద్వారా దాదాపు 434 సిఫార్సులను సమర్పించారు. ఇటీవల ఈ రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. అయితే, ఈ సిఫార్సులపై ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు విద్యావేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

**ప్రభుత్వ జీతాలు ఎక్కువయ్యాయనడమే తప్పా..**

ముఖ్యంగా మీడియా ఇంటర్వ్యూలలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని ఆయన సిఫార్సు చేయడం ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. అలాగే ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ పద్ధతిలోనే నియమించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేయాలని ఆయన సూచించడం పెద్ద కాంట్రవర్సీకి దారితీసింది. ఇంటర్ బోర్డును పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న ప్రతిపాదనపై కూడా సర్కార్ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో విద్యా కమిషన్ సిఫార్సులను ఆమోదించడానికి ప్రభుత్వం నిరాకరించింది.

**కేశవరావు కమిటీతో ‘బైపాస్’..**

విద్యా కమిషన్ సిఫార్సులపై వివాదం నడుస్తుండగానే.. ప్రభుత్వం నూతన ఎడ్యుకేషన్ పాలసీ రూపకల్పన కోసం ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు నేతృత్వంలో మరో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. చిత్రం ఏంటంటే.. చైర్మన్ హోదాలో ఉన్న ఆకునూరి మురళిని ఈ కొత్త కమిటీలో కేవలం ఒక సభ్యుడిగా నియమించింది. టీచర్ల జీతాలు తగ్గించే ప్రసక్తే లేదని కేశవరావు బహిరంగంగా ప్రకటించాల్సి వచ్చింది. దీంతో ఒక రకంగా విద్యా కమిషన్‌ను ప్రభుత్వం పూర్తిగా బైపాస్ చేసిందని, తన చైర్మన్ పదవికి ప్రాధాన్యత తగ్గించిందని మురళి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. తాను ఎంతో కష్టపడి చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా పాత పద్ధతులనే కొనసాగించడంపై ఆయన బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలను కలిసి తన పాయింట్ వివరించడానికి కొద్దిరోజులుగా ఆయన చేసిన ప్రయత్నాలు కూడా విఫలమవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు.

**వాట్సాప్ పోస్ట్.. ముఖ్య నేత సీరియస్!**

రాజీనామా వెనుక అసంతృప్తి ఒక కారణమైతే, తక్షణ కారణం మాత్రం ఒక సోషల్ మీడియా పోస్ట్ అని గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి ఆకునూరి మురళి ఒక వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెసేజ్ వివాదాస్పదమైంది. ఆ పోస్ట్ రెండు వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా ఉందనే విమర్శలు వచ్చాయి. ప్రభుత్వంలో ఒక బాధ్యతాయుతమైన కీలక పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వివాదాస్పద పోస్టులు పెట్టడం ఏంటంటూ ప్రభుత్వంలోని ‘ముఖ్య నేత’ ఆయనపై తీవ్రంగా సీరియస్ అయినట్లు సమాచారం. ప్రతిపక్షాలు దీనిని అస్త్రంగా చేసుకుని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టకముందే, మురళిని పదవి నుంచి వైదొలగాలని సదరు ముఖ్య నేత నుంచి స్పష్టమైన ఆదేశాలు వెళ్లినట్లు తెలుస్తోంది.

**నాడు కేసీఆర్ సర్కార్.. నేడు రేవంత్..**

ఆకునూరి మురళికి ఇలాంటి వివాదాలు కొత్తేమీ కాదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు మాంసాహారం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. అప్పట్లో ప్రభుత్వ ఆగ్రహానికి గురైన ఆయన, ఏడాది సర్వీస్ ఉండగానే వీఆర్‌ఎస్ తీసుకున్నారు. ఆ తర్వాత ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా సలహాదారుగా రెండేళ్లు పనిచేసి, ఆ పదవికి కూడా రాజీనామా చేసి తెలంగాణకు వచ్చారు. ఇక్కడ నిరుద్యోగులతో కలిసి కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బస్సు యాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి ఆయనపై నమ్మకంతో 2024 సెప్టెంబర్ 6న రెండేళ్ల కాలపరిమితితో ఈ విద్యా కమిషన్ చైర్మన్ పదవిని ఇచ్చారు. కానీ, ఇక్కడా ఆయన ప్రయాణం ఒడిదుడుకులతోనే ముగిసింది.

**అసలు నిజం తేలేది ఎప్పుడు?**

ఈ వివాదాలన్నీ ఒకెత్తయితే, మురళిని అభిమానించే వర్గాలు మాత్రం మరో సరికొత్త వెర్షన్‌ను తెరపైకి తెస్తున్నాయి. మురళికి త్వరలోనే ప్రభుత్వం మరో అత్యంత కీలకమైన పదవిని ఇవ్వబోతోందని, ఆ సాంకేతిక కారణాల వల్లే ప్రస్తుత పదవికి రాజీనామా చేయించారని వారు చెప్తున్నారు. ‘నివేదిక ఇవ్వడం పూర్తి అయింది కాబట్టే తప్పుకున్నా’ అని మురళి చెప్తున్నా.. నివేదిక ఇచ్చిన వెంటనే కాకుండా ఈ వివాదాల మధ్య ఎందుకు తప్పుకోవాల్సి వచ్చిందన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. ఏది ఏమైనా, ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన రాకపోవడం, ఉపాధ్యాయుల వ్యతిరేకత, వాట్సాప్ పోస్ట్‌పై ముఖ్య నేత ఆగ్రహం.. ఇవన్నీ కలగలిసి ఈ రాజీనామాకు దారితీశాయని స్పష్టమవుతోంది. ఈ సంచలన నిర్ణయంపై ఆకునూరి మురళి స్వయంగా నోరు విప్పితే తప్ప అసలు నిజాలు పూర్తిగా బయటకు వచ్చే పరిస్థితి లేదు.

# భగ్గుమంటున్న తెలంగాణ

- హైదరాబాద్‌లోనూ ఉక్కపోత.. మధ్యాహ్నం రోడ్లపై కనిపించని జనాలు
- మరో మూడు రోజులు ఇదే తీవ్రత.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక




**హైదరాబాద్, మే 25 సిరి న్యూస్::**

తెలంగాణలో ఎండలు భయపెడుతున్నాయి. రోహిణీ కార్తె ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి 46.5 డిగ్రీల వరకు నమోదవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచే మండిపోతున్న ఎండలతో మధ్యాహ్నం సమయాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తెలంగాణ ప్రణాళికా అభివృద్ధి సంస్థ విడుదల చేసిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు నమోదయ్యాయి. నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఎండలు నమోదయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదై రెడ్ అలర్ట్ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ ఎండ తీవ్రత పెరిగింది. నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మేడ్చల్‌మల్కాజ్‌గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపే నమోదై కొంత ఉపశమనం కనిపించింది. అయితే రానున్న మూడు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45.7 డిగ్రీల వరకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం వేళల్లో అవసరం లేకుండా బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# రైతు గోస - బీజేపీ భరోసా

**గజ్వేల్ టౌన్, మే 25, సిరి న్యూస్::**

రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకులు రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం ముట్రాజ్ పల్లి రింగ్ రోడ్డు, సంగాపూర్ రింగ్ రోడ్డు మీదుగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ చేరుకొని రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల గోస కాంగ్రెస్ పార్టీకి తగులుతుందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని, పేరుకే ఐకేపీ సెంటర్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రైతులు పండించిన పంట రోడ్ల పైన, కల్లాలలో, ఐకేపీ సెంటర్లలో నిలిచిపోయిందన్నారు. రోహిణి కార్తీ ప్రారంభమైనప్పటికి పండించిన పంట కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉండడంతో అకాల వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, రాత్రింబవళ్లు ధాన్యం వద్దే కాపలా కాస్తున్నారని, టాటిపాత్రులతో ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ వాతావరణం లో వచ్చిన మార్పులకి రైతులు ఇబ్బంది పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి కి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని, అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంత వరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని, తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకులు, జిల్లా రథసారధులు, మండల నాయకులు, సర్పంచులు, గజ్వేల్ పట్టన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# “ఒక్క ఇందిరమ్మ ఇల్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా”

- హైడ్రాతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- 420 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్
- 2028లో మళ్లీ కేసీఆర్‌దే అధికారం అంటూ ధీమా
- జూన్ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం



**హైదరాబాద్, మే 25 సిరి న్యూస్::**

“హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా” అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ఎమ్మెల్యేలు వివేక్ గౌడ్, నవీన్ రావు, శంభీపూర్ రాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై సమావేశంలో చర్చించారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు హైదరాబాద్ భవిష్యత్‌పై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, కానీ కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని కేటీఆర్ పేర్కొన్నారు. పేదలకు ఇబ్బందులు కలగకుండా పాలన అందించామని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి జీఓ 58, 59 ద్వారా పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం “ఇందిరమ్మ రాజ్యం”, “ప్రజా పాలన” పేరుతో హైడ్రా ద్వారా పేదల ఇళ్లను కూల్చివేస్తోందని విమర్శించారు. కొత్త ఇళ్లు నిర్మించకపోగా వేల సంఖ్యలో ఇళ్లను నేలమట్టం చేస్తోందని ఆరోపించారు.

పెన్షన్ల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం రూ.200 నుంచి రూ.2 వేల వరకు పెంచిందని, కానీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అసాధ్య హామీలతో ఓట్లు సాధించి ఇప్పుడు ప్రజలను నిరాశపరిచిందని వ్యాఖ్యానించారు.

“ముఖ్యమంత్రి జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతుంటే జేబుదొంగ అనుకోవద్దు.. ఆయన గజదొంగ” అంటూ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో నాలుగు వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని ఆరోపించారు. గృహ నిర్మాణ కార్మికులకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. జూన్ నెల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

2028 ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.





# యాతాలకుంట టన్నెల్ పరిశీలన

- పనుల పురోగతిపై సమీక్ష
- సాగునీటి సదుపాయాలపై దృష్టి
- వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు

ఖమ్మం, మే 25, సిరి న్యూస్:

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, సాంకేతిక అంశాలు, నాణ్యత ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఆలస్యం లేకుండా వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యాతాలకుంట ప్రాంతంలో కొనసాగుతున్న ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాలు మరింత మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. రైతులకు నీటి సమస్య తగ్గి వ్యవసాయ రంగానికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం భారీ స్థాయిలో సాగునీటి ప్రాజెక్టులను అమలు చేస్తోందని వెల్లడించారు. పనుల పరిశీలన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని హెచ్చరించారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. టన్నెల్ నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించి అవసరమైన చోట ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జారే ఆదినారాయణ పాల్గొని ప్రాంత ప్రజల సమస్యలు, సాగునీటి అవసరాలు, అభివృద్ధి పనుల ప్రాధాన్యతపై మంత్రికి వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు సాగునీరు, రహదారులు, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు సానుకూలంగా స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు టన్నెల్ నిర్మాణ పనుల వివరాలను మంత్రికి సమగ్రంగా వివరించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన దశలు, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై నివేదిక సమర్పించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా అదనపు యంత్రాంగాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. స్థానిక రైతులు, ప్రజలు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. సాగునీటి సదుపాయాలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రారంభమైన రోహిణి కార్తె

- జూన్ ఏడు వరకు ఎండల తీవ్రత
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- వడదెబ్బ ముప్పుపై వైద్యుల సూచనలు




హైదరాబాద్, మే 25 , సిరి న్యూస్:

తెలుగు పంచాంగం ప్రకారం అత్యంత శక్తిమంతమైన రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. జూన్ ఏడు వరకు కొనసాగనున్న ఈ కాలంలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ రోజుల కంటే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే మండుతున్న ఎండలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతుండగా, రోహిణి కార్తె ప్రభావంతో వడగాలులు, ఉక్కపోత మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని చెబుతున్నారు. రోహిణి కార్తె కాలాన్ని సంప్రదాయంగా అత్యంత వేడిగా ఉండే దశగా భావిస్తారు. ఈ సమయంలో భూమి ఉపరితలం తీవ్రంగా వేడెక్కడం వల్ల గాలి ఉష్ణోగ్రతలు కూడా అమాంతం పెరుగుతాయి. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారిపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచే మండే ఎండలు, మధ్యాహ్నం వడగాలులు, రాత్రి పూట ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల నీరసం, తలనొప్పి, అలసట, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బయట పనులు చేసే కార్మికులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువసేపు తిరగడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగి ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ ప్రభావం అత్యధికంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితులు తప్ప ఆ సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, ముఖానికి గుడ్డ కట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. లేత రంగు పత్తి దుస్తులు ధరించడం ద్వారా శరీరంపై వేడి ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి తరచూ మంచి నీరు తాగడం అత్యంత అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా కొద్దికొద్దిగా నీరు తీసుకోవాలని చెబుతున్నారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఉప్పు చక్కెర కలిపిన ద్రావణాలు వంటి పానీయాలు శరీరంలో నీటి శాతం నిలుపుకోవడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా బయట పనులు చేసే వారు నీటి సీసాలు వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. పుచ్చకాయ, దోసకాయ, కర్బూజ వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వేడి ఎక్కువగా ఉండే సమయంలో మసాలా, నూనె పదార్థాలు తగ్గించి తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు కోరుతున్నారు. రోహిణి కార్తె కాలంలో నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# సంగారెడ్డిలో అటవీ శాఖ భవనాల ప్రారంభం

- మంత్రుల జిల్లా పర్యటన
- అటవీ సంరక్షణకు ప్రాధాన్యత
- అర్బన్ ఎకో పార్కుల అభివృద్ధికి చర్యలు

సంగారెడ్డి, మే 25, సిరి న్యూస్:

రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండ సురేఖ సోమవారం సంగారెడ్డి జిల్లా పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కంపా నిధులతో నిర్మించిన అటవీ శాఖ బీట్ అధికారుల వసతి గృహాలను ప్రారంభించారు. సుమారు ముప్పై రెండు లక్షల ఇరవై మూడు వేల రూపాయల వ్యయంతో ఈ వసతి గృహాలను నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ భవనాలు అటవీ శాఖ సిబ్బందికి ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రులు ఒక కోటి నలభై నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన జిల్లా అటవీ సంరక్షణ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఆధునిక వసతులతో ఈ కార్యాలయాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. జిల్లా అటవీ శాఖ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలో అడవుల పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లాలో అర్బన్ ఎకో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నగర ప్రాంతాల్లో పచ్చదనం పెంపుతో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో అర్బన్ ఎకో పార్కులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పార్కుల ద్వారా ప్రజలకు విశ్రాంతి వాతావరణంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అడవుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో అటవీ అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అధికారులు తెలిపారు. మొక్కల పెంపకం, అడవుల విస్తరణ, పర్యావరణ సమతుల్యత కాపాడే కార్యక్రమాలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో అడవుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి సువర్ణ, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పోలీసు అధికారి పరతోష్ పంకజ్ పాల్గొన్నారు.

# కోహెడలో భూసేకరణ ఉద్రిక్తత

- అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు
- జేసీబీ ముందు పడుకుని నిరసన
- భారీగా పోలీసుల మోహరింపు

రంగారెడ్డి, మే 25, సిరి న్యూస్:

రంగారెడ్డి జిల్లాలోని కోహెడ గ్రామంలో భూసేకరణ అంశంపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫ్రూట్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కోసం అధికారులు భూముల పరిశీలనకు రావడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. తమ భూములను బలవంతంగా తీసుకోవద్దంటూ అధికారులను అడ్డుకున్నారు. గ్రామస్తులు మండుటెండలో కూడా వెనక్కి తగ్గకుండా జేసీబీ యంత్రాలకు అడ్డంగా పడుకుని నిరసన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతే జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా భూసేకరణ చేపట్టరాదని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అధికారులు గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం చేయగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని తోపులాట జరిగినట్లు సమాచారం. పరిస్థితి అదుపుతప్పకుండా పోలీసులు భారీగా మోహరించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ చేపడుతున్నామని అధికారులు గ్రామస్తులకు వివరించినట్లు సమాచారం. అభివృద్ధి పనుల కోసం భూములు అవసరమని చెప్పినా గ్రామస్తులు అంగీకరించలేదు. సరైన పరిహారం, స్పష్టమైన హామీలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా నిర్వహిస్తున్నారు. పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అధికారులు గ్రామ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. భూసేకరణ అంశంపై ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలపై స్థానికంగా ఉత్కంఠ కొనసాగుతోంది.



# కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, మే 25, సిరి న్యూస్:

శివునికి ప్రీతిపాత్రమైన సోమవారం సందర్భంగా కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీ భారీగా పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానాలు ఆచరించారు.

పుష్కరాల ఐదో రోజు సోమవారం త్రివేణి సంగమం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివనామస్మరణ మధ్య భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి నీరాజనాలు అర్పించారు. అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదిలో స్నానం చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందన్న విశ్వాసంతో తెల్లవారుజాము నుంచే ఘాట్లకు భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పుష్కర ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు నదిలో లోతట్టు ప్రాంతాలకు భక్తులు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, బోట్లను అందుబాటులో ఉంచి భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు.

పుష్కరాల్లో దానధర్మాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పురాణాలు చెబుతున్నాయి. సోమవారం శివునికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు దీపదానాలు, ఇతర దానాలు నిర్వహించారు. పుష్కర సరస్వతి ఒడిలో స్నానం చేసి పూజలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు పేర్కొన్నారు.

# ఉగ్రదాడుల్లో శిక్షణ ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

దృష్టికి వచ్చాయి. దింతో ఉత్తర్ ప్రదేశ్ లోని ఘజియాబాద్ జిల్లాకు చెందిన జాహెద్ ఖాన్ ను మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జాహెద్ ఖాన్ ను విచారించిన పోలీసులకు కీలక సమాచారం లభించింది. 2023 లో బొమ్మ తుపాకులతో జాహెద్ ఖాన్ రీల్ చేసినట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఇస్లాం కోసం పోరాటానికి సిద్ధమంటూ ఇన్స్టాలో ఉగ్రదాడులు శిక్షణ ఇవ్వాలని కోరడం వెలుగులోకి వచ్చింది. ఇంస్టా లోని ఒక గ్రూప్లో ఇలా 1000 మంది కి పైగా ఉన్నట్టు తెల్సింది. ఈ మేరకు తుపాకుల కోసం జావేద్ అబిద్ రానా అనే వ్యకిని సంప్రదించినట్టు పోలీస్ విచారణలో తేలింది.తుపాకులు పొందడం ద్వారా ఉగ్ర దాడులు చేయాలనీ జావేద్ ఖాన్ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. జావేద్ పాక్ డాన్ నవజాద్ తో సైతం చాట్ చేసినట్టు. దేశానికి సంబందించిన కొంత సమాచారాన్ని చేరవేసినట్టు విచారణలో తేలింది. జావేద్ ఇదివరకు కలకత్తా లో ఓ వస్త్ర దుకాణంలో సైతం పని చేసినట్టు తెలిసింది. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు జావేద్ ఖాన్ న అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపగా అతనికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# ధాన్యం నిల్వలపై ఆకస్మిక తనిఖీలు

- రైస్ మిల్లులపై మంత్రి ఆగ్రహం
- రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
- మిల్లులు, గోదాముల వద్ద పోలీసు నిఘా


నాగర్‌కర్నూల్, మే 25, సిరి న్యూస్:

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్ల మండలంలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, నిల్వలు, లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అక్కడి నిర్వాహకులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. రోజుల తరబడి ధాన్యం లారీలను అన్‌లోడ్ చేయకుండా నిలిపివేస్తున్న రైస్ మిల్లులపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. తాలు, తరుగు పేర్లతో రైతులకు నష్టం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రైతుల కష్టానికి సరైన విలువ దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

రైస్ మిల్లులు, గోదాముల వద్దకు వచ్చే ప్రతి లారీని వెంటనే అన్‌లోడ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు రాకూడదని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లారీల రాకపోకలు, ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియపై పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు ధాన్యం కొనుగోలు పరిస్థితులు, నిల్వ సామర్థ్యం, లారీల అన్‌లోడింగ్ వ్యవస్థపై మంత్రికి వివరించారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- కంటైనర్ లారీని ఢీకొట్టిన డీసీఎం
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు




హైదరాబాద్, మే 25, సిరి న్యూస్:

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శామీర్‌పేట్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వేగంగా వచ్చిన డీసీఎం వెనుక నుండి ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో డీసీఎం ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాలతో వాహనంలో చిక్కుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా దెబ్బతిన్న వాహనం నుంచి గాయపడిన వ్యక్తిని బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా ఔటర్ రింగ్ రోడ్డుపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ప్రమాదానికి అతివేగం కారణమా లేక ఇతర సాంకేతిక కారణాలున్నాయా అనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాద సమయంలో వాతావరణ పరిస్థితులు, వాహనాల వేగం, రోడ్డుపై పరిస్థితులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవల ఔటర్ రింగ్ రోడ్డుపై వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అతివేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. భారీ వాహనాలు రోడ్డుపై నిలిపే సమయంలో భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పై విశ్వాసం కోల్పోయిన ప్రజలు

- 80 శాతం ధాన్యం కొనుగోలు జరిగాయన్న అబద్దాల సీఎం రేవంత్ రెడ్డి
- బిజెపి పర్యటనతోనే అధికారుల్లో చలనం
- ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- గజ్వేల్ కు చేరుకున్న బిజెపి రైతు గోస - భరోసా బస్సు యాత్ర



**గజ్వేల్, మే 25 (సిరి న్యూస్):**

సకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో పాటు అబద్దాలతో కాలం వెల్లదీస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, శాసనసభ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్ రఘునందన్ రావులు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాపూర్ ఔటర్ రింగ్ రోడ్డుపై రైతులు ఆరబోసిన వడ్లను, గజ్వేల్ మార్కెట్ యార్డ్ లో కొనుగోలు కేంద్రంలోని వడ్లు, మక్కలు పొద్దుతిరుగుడును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బిజెపి ప్రజా ప్రతినిధుల బృందం పరిశీలించారు. బీజేపీ చేపట్టిన "రైతు గోస–భరోసా" బస్సు యాత్రలో భాగంగా ఆయన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ తాము గజ్వేల్‌కు వస్తున్నామని ప్రకటించిన తర్వాతే ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. బిజెపి పర్యటిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయంటే ప్రజల కోసం ప్రతిరోజు గ్రామాలను సందర్శించి సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. వర్షాలు పడితే ధాన్యం నేలపాలు అయ్యే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కోటిన్నర మెట్రిక్ టన్నుల దాన్యం రైతులు పండిస్తే 80% ఇప్పటికే కొనుగోలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. రోడ్లపై కొనుగోలు కేంద్రాల వద్ద 50 శాతానికి పైగానే ధాన్యం ఉన్నట్లు వెల్లడించారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్ లో కూడా కేసీఆర్ రైతుల సమస్యలపై ఆయన స్పందించడం లేదని విమర్శించారు. రైతులకు ఇబ్బందులు కలిగించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. ప్రతి గింజ కొనుగోలు చేసే వరకు బీజేపీ రైతుల తరఫున పోరాటం కొనసాగిస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ రైతుననే చెప్పుకునే కేసీఆర్ కు రైతుల గోస తెలియడం లేదా అని ప్రశ్నించారు. బిజెపి పర్యటన గురించి తెలిసి నిన్న కలెక్టర్ ఆఘమేఘాల మీద వచ్చి బయటనుంచి కార్మికులను తెచ్చి వడ్లను తరలించడం సంతోషకర విషయమేనన్నారు. వ్యవసాయం చేసే ముఖ్యమంత్రికి రైతు కష్టం తెలుసు కానీ మన సీఎం రియల్ ఎస్టేట్ చేసే వ్యక్తి కాబట్టి ఆయనకు ఫ్యూచర్ సిటీ కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. పంట నాటు వేసినప్పుడే అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఎన్ని ఎకరాలు పంట వేసిందో తెలుసుకోవాలని, బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎటు పోయినా రైతుల కండ్లలో నీళ్లు , రక్తం చూస్తున్నామన్నారు. వడ్ల కొనుగోలలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. తక్షణమే ట్రాన్స్పోర్ట్ వ్యవస్థను పెట్టి వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షుడు బడి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## సంపాదకీయం



# రాజకీయ కుసంస్కారం - ప్రజాస్వామ్య విలువలకే ముప్పు !

ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు, ప్రభుత్వాలు, క్యాబినెట్ సమావేశాలు అత్యున్నత గౌరవప్రదమైన వేదికలు. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు ఎంత ప్రాముఖ్యమైనవో, ప్రజాప్రతినిధులు ప్రదర్శించే ప్రవర్తన కూడా అంతే ముఖ్యం. అయితే ఇటీవల తెలంగాణ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పక్కనే ఉన్న సహచర మంత్రి వాకిటి శ్రీహరిపై బహిరంగంగా పేపర్లు విసిరికొట్టిన ఘటన రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ హఠాత్ పరిణామం కేవలం ఒక వ్యక్తిగత కోపానికి నిదర్శనం కాదు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండవలసిన కనీస రాజకీయ సంస్కారానికి, తోటి ప్రజాప్రతినిధుల పట్ల ప్రదర్శించాల్సిన గౌరవానికి గొడ్డలిపెట్టుగా నిలుస్తోంది. బాధ్యతాయుత స్థానంలో అనాలోచిత వైఖరి ప్రభుత్వ నిర్ణయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన వేదికపై, అత్యంత అహంకార పూరితంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. మీడియా సమావేశంలో పక్కనే కూర్చున్న మంత్రి వాకిటి శ్రీహరి ఏదో ఒక సమాచారాన్ని వివరించేందుకు పేపరును అందించగా, దానిని పరిశీలించిన పొంగులేటి క్షణకాలంలోనే తీవ్ర ఆగ్రహంతో ఆ ప్రతులను శ్రీహరి ముఖంపైకే విసిరేశారు. ప్రత్యక్ష ప్రసారాలు సాగుతున్నాయనే కనీస స్పృహ లేకుండా ప్రదర్శించిన ఈ అసహనం అధికార పీఠంలో ఉన్నవారి బాధ్యతను ప్రశ్నిస్తోంది. మంత్రి వర్గంలో సహచరులందరూ సమాన హోదా కలిగిన వారే. ఒక క్యాబినెట్ మంత్రి, మరో మంత్రి పట్ల ఇంత బహిరంగంగా దురుసుగా ప్రవర్తించడం బాధితుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాక, కేబినెట్ ఉమ్మడి బాధ్యత అనే మూల సూత్రాన్నే అపహాస్యం చేస్తోంది. ఈ ఉదంతం కేవలం ఇద్దరు మంత్రుల మధ్య వివాదంగా మిగిలిపోలేదు. ఇది తెలంగాణ సమాజంలో తీవ్ర సామాజిక అశాంతికి దారితీస్తోంది. బాధితుడైన మంత్రి వాకిటి శ్రీహరి వెనుకబడిన తరగతులకు (బీసీ – ముదిరాజ్ సామాజిక వర్గం) చెందిన నేత కావడంతో, ఈ దాడిని 'అగ్రవర్ణ అహంకారం'గా బీసీ సంఘాలు అభివర్ణిస్తున్నాయి. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ వంటి సంఘాలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ 24 గంటల్లోగా మంత్రి పొంగులేటి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. వెనుకబడిన, బలహీన వర్గాల ప్రాతినిధ్యానికి ప్రభుత్వంలో లభిస్తున్న గౌరవం ఇదేనా అంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలు అధికార పక్షానికి ఇబ్బందికరంగా మారాయి. అధికారం అనేది బాధ్యతను, ఓర్పును నేర్పాలే తప్ప అహంకారాన్ని, ఆగ్రహాన్ని కాదు. ప్రజాజీవితంలో ఉన్నవారికి సహనం, క్రమశిక్షణ అత్యంత అవసరం. ప్రభుత్వ పెద్దలు ఇటువంటి ప్రవర్తనలను ఉపేక్షిస్తే, అది సమాజానికి, కింది స్థాయి నాయకులకు తప్పుడు సంకేతాలను పంపుతుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, పార్టీలు, ప్రభుత్వ అధినేతలు తమ మంత్రుల ప్రవర్తనా నియమావళిని (కోడ్ ఆఫ్ కండక్ట్ ) కఠినంగా అమలు చేయాలి. రాజకీయాల్లో విభేదాలు, వ్యక్తిగత అసంతృప్తులు సహజం. కానీ వాటిని ప్రదర్శించడానికి అధికారిక మీడియా సమావేశాలు వేదికలు కాకూడదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేసి గెలిపించిన సామాన్య ప్రజల కంటే ఎవరూ అధికులు కారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన తప్పును గుర్తించి, తక్షణమే సహచర మంత్రికి, బహుజన సమాజానికి క్షమాపణ చెప్పడం ద్వారానే ఈ వివాదానికి సగర్వంగా ముగింపు పలకగలరు. లేనిపక్షంలో ఈ అహంకారపూరిత వైఖరి భవిష్యత్తులో ప్రభుత్వ నైతికతను పాతాళానికి నెట్టేసే ప్రమాదం ఉంది.

# మెడకు తాడు బిగించి.. గుంతలో పూడ్చి..!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య
- ప్రియుడు, అన్నతో కలిసి భార్య ఘాతుకం
- మిస్సింగ్ కేసును చాకచక్యంగా ఛేదించిన నారాయణఖేడ్ పోలీసులు
- నిందితుల అరెస్ట్.. రిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన

**నారాయణఖేడ్, సిరి న్యూస్:**




అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే నెపంతో ప్రియుడితో కలిసి భార్యే స్వయంగా భర్తను దారుణంగా హత్య చేయించిన ఘోర ఉదంతం సంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసింది. మాయమాటలతో నమ్మించి జనసంచారం లేని ప్రాంతానికి తీసుకెళ్లి, దారుణంగా హత్య చేసి శవాన్ని గుంతలో పూడ్చిపెట్టిన ఈ మిస్సింగ్ కేసును నారాయణఖేడ్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఈ హత్యకు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన శంబనోల్లా ముత్యం రెడ్డి (35) బోరు మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీ నుండి ఆయన కనిపించకుండా పోవడంతో, ముత్యం రెడ్డి భార్య శంబనోల్లా కల్పన మే 18న నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, విచారణ సమయంలో కల్పన ప్రవర్తనపై పోలీసులకు అనుమానం రావడంతో ఆమెపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో కల్పనకు మానూర్ మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన గైని పండరి అనే యువకుడితో అక్రమ సంబంధం ఉన్నట్లు పోలీసుల విచారణలో నిజా నిజాలు బయటపడ్డాయి. గత కొంతకాలంగా కల్పన, పండరి మధ్య నడుస్తున్న ఈ వ్యవహారం ముత్యం రెడ్డికి తెలియడంతో ఆయన భార్యను పలుమార్లు మందలించాడు. దీంతో భర్త బతికుంటే తమ బంధానికి అడ్డుపడతాడని భావించిన కల్పన, ప్రియుడు పండరితో కలిసి భర్తను వదిలించుకోవాలని పథకం రచించింది. ఇందులో భాగంగా ఈ నెల 16న ముత్యం రెడ్డి నారాయణఖేడ్ వచ్చిన సమయంలో, పండరి తన పొలంలో బోరు మోటార్ స్టార్టర్ రిపేర్ ఉందంటూ నమ్మించి ఆయనను బైక్‌పై తీసుకెళ్లాడు. అక్కడ ముందుగానే పొలంలో సిద్ధంగా ఉన్న పండరి అన్న గైని విట్టల్‌తో కలిసి, ఇద్దరూ ముత్యం రెడ్డి మెడకు తాడు బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా, ముందుగానే జేసీబీతో తవ్వించి ఉంచిన గుంతలో శవాన్ని పడేసి మట్టితో పూడ్చిపెట్టారు. కల్పన ఇచ్చిన సమాచారంతో ప్రియుడు గైని పండరిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ దారుణ హత్య ఉదంతం మొత్తం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గైని పండరి (24), అతని అన్న గైని విట్టల్ (33), మరియు మృతుడి భార్య శంబనోల్లా కల్పన (30)లను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మిస్సింగ్ కేసును అతి తక్కువ కాలంలో ఛేదించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

# జిన్నారం అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే జీఎంఆర్
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- జిన్నారం మున్సిపాలిటీలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పటాన్చెరు, మే 25, సిరి న్యూస్ :**

జిన్నారం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, రాళ్లకత్వ తండా, సోలక్‌పల్లి, అందూర్, ఇమామ్‌నగర్, ఊట్ల, దాదిగూడెం, మంగంపేట, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూరు, కొర్లకుంట వార్డుల్లో రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రజలు నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీకి ఐదు మున్సిపాలిటీల్లో అధికారం అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా వచ్చే ఐదు సంవత్సరాలు సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతామని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చౌకబారు వేషాలు వేస్తున్న ఎమ్మెల్యే హరీష్ రావు

- కొనుగోలు ఆపేది.. ధర్నాలు చేసేది.. హరీష్ రావే..
- హరీష్ రావు రైతులతో రాజకీయం చేయడం సిగ్గుచేటు
- మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి ఫైర్

**నంగునూరు, మే 25,సిరి న్యూస్:**

సిద్దిపేట జిల్లాలో మాజీ మంత్రి హరీష్ రావు చౌకబారు వేషాలు వేస్తూ జిల్లా రైతాంగాన్ని గందరగోళానికి గురి చేస్తున్నారని, హరీష్ రావు ఇలాంటి నీతిమాలిన చర్యలకు వెంటనే పులిస్టాప్ పెట్టాలని, లేనిపక్షంలో రైతుల సమక్షంలోనే మాజీ మంత్రికి పరాభవం తప్పదని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి హెచ్చరించారు. ఓ పక్క కొనుగోలు ఆపుతూ మరో పక్కన ధర్నాలు చేసేది హరీష్ రావే నని రైతాంగానికి అర్థం అయిందని దేవులపల్లి యాదగిరి మాజీ మంత్రిపై తీవ్రంగా ఫైర్ అయ్యారు. సోమవారం ఖానాపూర్, మద్దుంపూర్, పాలమాకుల గ్రామాల వద్ద కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. భాధ్యత గల ఎమ్మెల్యే హోదాలో ఉన్న హరీష్ రావు ఓట్లేసిన గెలిపించిన పాపానికి కొనుగోలు కేద్రాలను పాక్స్ చైర్మన్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు ఓ పక్క ఆపిస్తూ మరో పక్కన రైతులను రెచ్చగొట్టి రోడ్లమీద ధర్నాలు చేయిస్తూ చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంగునూరు, పాలమకుల సొసైటీ చైర్మండ్లు వారి సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కయి అదనంగా ఒక్క భాస్తాకు అదనంగా రెండు, మూడు కిలోలు తూకం వేస్తేనే దిగుమతి చేస్తారని, లేదంటే మా మిల్లులో స్థలం లేదు అంటూనే, వారి డిమాండ్ కు రైతులు ఒప్పుకుంటే దిగుమతి చేపిస్తున్నారని, ఒప్పుకోని రైతులకు తీవ్రంగా ఇబ్బందులకు గురించేయ్యడం హెయమైన చర్యంటూ విమర్శించారు. ఖానాపూర్ లో లారీలు రాక ఇబ్బంది పడితే మిల్లర్తో మాట్లాడి సమస్య పరిష్కారం చేశారు. పాలమాకుల, నంగునూరు, మగ్దుంపూర్, గ్రామాల కొనుగోలు కేంద్రాలలోని సమస్యలు ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని కేంద్రాలలో ఉన్నా సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలనీ మంత్రి వివేక్ వెంకట స్వామి జిల్లా కలెక్టర్ కి ఆదేశాలు జరీచేసినట్టు పేర్కొన్నారు. ఫోన్ చేయగానే స్పందించి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేసిన ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామికి మండల రైతులకు పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, పాక్స్ డైరెక్టర్ గంగుల రవి, సందేబోయిన తిరుపతి, భాస్వారాజు రాములు, పంగ రాజశేఖరరెడ్డి, పాకాల భాస్కర్,ఎండీ ఎజాజ్, ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యం-సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మందుల సామెల్
- అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**నూతనకల్, మే 25, సిరి న్యూస్:**

చిన్నారుల ఆరోగ్యం సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, ఆ దిశగా రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా అంగన్వాడీ కేంద్రాలను నిర్మించి అందుబాటులోకి తెస్తుందని ఎమ్మెల్యే మందులు సామెల్ పేర్కొన్నారు. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించడానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జన్నారెడ్డి వివేక్ రెడ్డి చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు కాసోజు మధనచారీ, నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పెదనెమిల గ్రామ సర్పంచ్ సూరకంటి లావణ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కాపురం వెంకన్న, కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబెర్స్ చిప్పలపల్లి రాంబాబు, బొల్క స్రవంతి, బొల్క చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమిరెడ్డి మల్లారెడ్డి, పసుల యాదగిరి, కాసోజ్ ఉపేందర్, సామ రాజశేఖర్ రెడ్డి, కాసోజు మధు, చిప్పలపల్లి సందీప్, గుర్రం వెంకన్న, బొబ్బ సాయి రెడ్డి, కనకం వెంకన్న, కనకం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్స్, ఆయమ్మలు, ప్రజలు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల కఠిన చర్యలు..!

- మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా
- వివరాలు వెల్లడించిన పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్

**రామచంద్రపురం,(పటాన్‌చెరు), మే 25, (సిరి న్యూస్):**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను సోమవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించింది.పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు

# రూ.1.20 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

## 19వ వార్డు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
## కౌన్సిలర్ వరలక్ష్మి కృష్ణ

**గుమ్మడిదల, మే 25 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో రూ.1 కోటి 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుమ్మడిదల మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ బ్యాగరి వరలక్ష్మి కృష్ణ తెలిపారు. శ్రీ నల్లపోచమ్మ దేవస్థానం సమీపం నుండి పలాటి నర్సింగ్ రావు గారి ఇంటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి పఠాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. 19వ వార్డు ప్రజలకు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ పనులు పూర్తయితే స్థానికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కౌన్సిలర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి వార్డు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# బీరప్ప జాతరకు రూ.2 లక్షల విరాళం

## మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఉదార సహాయం



**రామచంద్రపురం, మే 25, (సిరి న్యూస్):**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్‌లోని బీరప్ప జాతరకు స్థానిక మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. గ్రామ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బీరప్ప జాతరను ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కొల్లూరి భరత్ మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ఇటువంటి వేడుకలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ప్రజల ఐక్యతను పెంపొందించే బీరప్ప జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికుల సంక్షేమమే లక్ష్యం..

- వెయ్యి గజాల స్థలం, భవన నిర్మాణానికి సహకారం: ఎమ్మెల్యే జీఎంఆర్

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 25, (సిరి న్యూస్):**



సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంఘం కార్యకలాపాల కోసం అతి త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు.సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నియోజకవర్గ స్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంఘం సభ్యుల అభ్యర్థన మేరకు వెయ్యి గజాల స్థలంతో పాటు సంఘ భవన నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు.అలాగే కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలం లేని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

- జిల్లా కలెక్టర్‌కు సర్పంచ్ మహిపాల్ రెడ్డి వినతి

**గుమ్మడిదల, మే 25 (సిరి న్యూస్):**





గుమ్మడిదల మండల పరిధిలోని రాంరెడ్డిబావి గ్రామపంచాయతీలో అర్ధాంతరంగా నిలిచిపోయిన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు గ్రామ ప్రజాప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో గత పాలకవర్గం హయాంలో ప్రారంభించిన గ్రామపంచాయతీ భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రస్తుత సర్పంచ్ సామల మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా, భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపినట్లు వెల్లడించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి అమృతవనం పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరైన సందర్భంగా సర్పంచ్ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పరిపాలనా కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే నిధులు విడుదల చేసి పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధికి గ్రామ పంచాయతీ భవనం కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానుకుంట సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ సామల దయాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ ఎండి పాషా, నాయకులు అంజాద్ ఖాన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలు

**వెల్దుర్తి, మే 25,( సిరి న్యూస్):**






మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం లోని ఆవుల రాజిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి కంటి శుక్లం ఆపరేషన్లు అవసరమైన 35 మందిని సోమవారం ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ లోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. వారందరికీ పూర్తి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి, కోలుకున్న అనంతరం తిరిగి వారి స్వగ్రామాలకు చేరుస్తామని రాజిరెడ్డి వెల్లడించారు. పేద ప్రజలకు కార్పొరేట్ అందించడమే మా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని, కంటి శిబిరంలో గుర్తించిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని, మాట ఇచ్చామని, అంతేకాకుండా కంటి అద్దాలు అవసరమైన వారందరికీ కూడా త్వరలోనే అద్దాలు కూడా ఇంటి వద్దకే పంపిణీ చేస్తామని వారు తెలిపారు. తన నియోజకవర్గంలోని నిరుపేదలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారి యొక్క ముఖ్య ఉద్దేశం అని ఎల్లప్పుడూ వారి కోసం ఈ ఫౌండేషన్ ఇకముందు ఇంకా కొన్ని కార్యక్రమాలు త్వరలోనే మీ ముందుకు వస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు ముక్తా బాయ్, తదితరులు పాల్గొన్నారు.

# గీతం కెఎస్‌పీపీకి పోలీసు అకాడమీ సత్కారం..

- గవర్నర్ చేతుల మీదుగా స్మారక చిహ్నం స్వీకరించిన డీవీవీఎస్ఆర్ వర్మ

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 25, (సిరి న్యూస్):**



వృత్తిపరమైన శిక్షణ, ప్రజా సేవ రంగాలలో నాలుగు దశాబ్దాల సేవలను పూర్తిచేసుకున్న సందర్భంగా రాజా బహదూర్ వెంకట రామరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ (ఆర్బీవీఆర్ఆర్ టీజీపీఏ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కెఎస్‌పీపీ)ను సత్కరించింది.హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీసు అకాడమీ ప్రాంగణంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ స్మారక చిహ్నాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్ట్, మాజీ డైరెక్టర్ పి. ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యా, ప్రజా సేవా రంగాల్లో కొనసాగుతున్న సంస్థాగత భాగస్వామ్యాలను గుర్తిస్తూ యునిసెఫ్, ఐఐటీ హైదరాబాద్, జేఎన్టీయూ హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ వంటి పలు ప్రముఖ సంస్థలను కూడా అకాడమీ సత్కరించింది.సుపరిపాలన, విధాన విద్య, పరిశోధన, నాయకత్వాభివృద్ధి, సామర్థ్య నిర్మాణం వంటి అంశాల్లో విద్యా సంస్థలు – ప్రజా సేవా సంస్థల మధ్య పెరుగుతున్న సమన్వయానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. సమాజ అభివృద్ధికి దోహదపడే అర్థవంతమైన భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయడంలో కెఎస్‌పీపీ తన నిబద్ధతను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# ఆల్వాల్ హై టెన్షన్ రోడ్డు విస్తరణపై కమిషనర్‌కు 'నాసా' వినతి

**అల్వాల్, సిరి న్యూస్ మే 25:**



నార్త్ అల్వాల్ సొసైటీస్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో అల్వాల్ హిల్స్ హై టెన్షన్ లైన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులపై సోమవారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా 'నాసా' ప్రతినిధులు మాట్లాడుతూ.. అసోసియేషన్ నిరంతర ప్రయత్నాల వల్ల హైటెన్షన్ లైన్ రోడ్డుకు సంబంధించిన చాలా సమస్యలు ఇప్పటికే పరిష్కరించబడ్డాయని తెలిపారు. అయితే, రోడ్డు పనులను వేగవంతం చేయడంతో పాటు మిగిలి ఉన్న అడ్డంకులను తొలగించాల్సిందిగా కమిషనర్‌ను కోరినట్లు వెల్లడించారు.దీనిపై అధికారులు స్పందిస్తూ.. ఈ ప్రాంతానికి సంబంధించిన రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్. ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని దీనికి కొంత సమయం పడుతుందనీ.. ఈలోగా, సాధ్యమైనంతమేరకు రోడ్డు వెడల్పు ప్రక్రియను చేపడతామని హామీ ఇచ్చారు.

**విబిఅర్ గార్డెన్ స్ట్రెచ్ వద్ద అడ్డంకులు తొలగించాలి:**

ప్రస్తుతం పనులు జరుగుతున్నప్పటికీ, విబిఆర్ గార్డెన్ స్ట్రెచ్ సమీపంలో ఇంకా కొన్ని ముఖ్యమైన సాంకేతిక అడ్డంకులు అలాగే ఉన్నాయని అసోసియేషన్ గుర్తు చేసింది. ఈ బాటిల్‌నెక్‌లను ఇప్పుడే పూర్తిగా తొలగించకపోతే, ఆయా ప్రాంతాలలో రోడ్డు శాశ్వతంగా ఇరుకుగా ఉండిపోయే ప్రమాదం ఉందని, దీనివల్ల భవిష్యత్తులో స్థానికులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.దీనితో పాటు, సాయిబాబా నగర్ నుండి హైటెన్షన్ లైన్ రోడ్డును కలిపే లింకు రోడ్డులో ఉన్న పలు సమస్యలను కూడా కమిషనర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా రవాణా సౌకర్యార్థం ఆ లింక్ రోడ్డును 60 ఫీట్లకు వెడల్పు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ రోడ్డు విస్తరణ పనులు వంద శాతం విజయవంతం కావడానికి స్థానికులు, కాలనీ తమిటీలు తమ వ్యక్తిగత పరిచయాలను మరియు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి, అధికారులపై సమస్య పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావాలని 'నాసా' పిలుపునిచ్చింది. మెరుగైన మౌలిక వసతుల కోసం కాలనీలన్నీ ఒకే తాటిపైకి వచ్చి సహకరించాలని కోరారు.

# అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు మంచిది కాదు

- ఎమ్మెల్యే జీఎంఆర్
- ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని డిమాండ్
- జిన్నారం, సోలక్‌పల్లి కొనుగోలు కేంద్రాలను స్వయంగా పరిశీలించిన గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, మే 25సిరి న్యూస్,:**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కొనసాగుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. "అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదు" అంటూ వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం జిన్నారం, సోలక్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జీఎంఆర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. గత 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎప్పుడు వర్షం పడుతుందోనన్న భయంతో ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో గత పది సంవత్సరాలు రైతాంగానికి స్వర్ణయుగంగా నిలిచాయని అన్నారు. రైతుబంధు, రైతు భీమా, సాగునీరు, మద్దతు ధరతో పాటు పంట కొనుగోళ్లు సకాలంలో జరిగేవని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా మారిందని విమర్శిం చారు.పటాన్చెరు నియోజక వర్గంలో వ్యవసాయం పరిమితంగానే ఉన్నప్పటికీ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మరో వారం రోజుల్లో రుతుపవనాలు ప్రారంభమయ్యే అవకాశమున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు అలాగే ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శ నమని పేర్కొన్నారు.రవాణా, హమా లీలు, గన్ని బ్యాగుల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి ఫోన్‌లో సూచించినట్లు తెలిపారు. రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసి, చెల్లింపులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు





**వెల్దుర్తి,మే 25, (సిరి న్యూస్ ):**

పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి★యందు సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా ★ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారి మానసిక–శారీరక వికాసానికి దోహద పడడం లక్ష్యంగా ★పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి లో మే 11న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ మే 25న విజయవంతంగా ముగిసింది అని ఈ శిబిరం విద్యార్థులకు కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా, జీవితానికి ఉపయోగపడే ఎన్నో విలువైన పాఠాలను నేర్పింది అని సాంబయ్య అన్నారు.ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతి రోజు కొత్త విషయాలను నేర్చుకుంటూ ఆనందంతో గడిపారు. ఆటలు, కళలు, సంగీతం, యోగా, కరాటే, నృత్యం వంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి.ఈ శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి శిక్షకుడికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.డాన్స్ మాస్టర్ చింటూ విద్యార్థులకు నృత్యంలో లయ, క్రమశిక్షణ, భావ వ్యక్తీకరణను నేర్పి వారిలో కళాప్రతిభను వెలికి తీశారు.కరాటే మాస్టర్ నైనిషా పిల్లలకు ఆత్మరక్షణతో పాటు ధైర్యం, నియమ నిష్టలను అలవాటు చేశారు.యోగ టీచర్ అనంత రెడ్డి యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు.మ్యూజిక్ టీచర్ చంద్ర గౌడ్ సంగీత స్వరాల ద్వారా విద్యార్థుల హృదయాల్లో ఆనందాన్ని నింపి కళాప్రేమను పెంపొందించారు.ఈ శిక్షకులందరూ విద్యార్థులను ప్రేమతో, సహనంతో శిక్షణ ఇచ్చి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చారు. వారి సేవలు నిజంగా అభినందనీయం.అని కొనియాడారు.ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులు కేవలం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడమే కాకుండా, సమయపాలన, క్రమశిక్షణ, జట్టు భావన, పరస్పర గౌరవం వంటి మంచి విలువలను కూడా అలవరుచుకున్నారు.ఇలాంటి శిబిరాలు గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయ బృందం, శిక్షకులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు.తెలిపారు."వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల ప్రతిభను వికసింపజేసినఈ సమ్మర్ క్యాంప్అం దరికీ చిరస్మరణీయంగా నిలిచిపోతుంది." అని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తో పాటు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, విజయ్ మోహన్ రాజ్, ఖదీర్ పాషా లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలి





**• జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ మే,25(సిరిన్యూస్)**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జెడ్పీ సి ఈ వో ఎల్లయ్యా,ఆర్ & బీ శాఖ అధికారి వేణు,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డి ఎస్పీ లు ,జాతీయ రహదారి అధికారులు ,రవాణా శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**• మంత్రి కొండా సురేఖకు జనచైతన్య కళా సంస్థ వినతి**

**గుమ్మడిదల, మే 25 (సిరి న్యూస్):**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పించిన కళాకారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని జనచైతన్య కళా సంస్థ కళాకారుల బృందం దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కాలం నుంచి గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజా సమస్యలపై పాటలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్య పరిచేందుకు నిరంతరం కృషి చేసినప్పటికీ, ఇప్పటికీ అనేక మంది కళాకారులకు సొంత ఇళ్లు లేక అద్దె గదుల్లోనే జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని కళాకారులు పేర్కొన్నారు. 2007 నుంచి 2014 వరకు తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అలసిపోయిన కళాకారులకు ప్రస్తుత ప్రజా పాలనలో అయినా న్యాయం జరుగుతుందనే ఆశతో మంత్రి కొండా సురేఖను కలిసి తమ సమస్యను వివరించినట్లు తెలిపారు. కళాకారులు సమాజంలో చైతన్యాన్ని తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, అలాంటి పేద కళాకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకొని వారి



కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య కళా సంస్థ అధ్యక్షులు వి.యం. ఎల్లయ్య, కళాకారులు నీరుడి కృష్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం





**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్మే,25(సిరిన్యూస్)**

జిల్లాలో మహిళను కోటిశ్వరులుగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మహిళా సమాఖ్య భవనాలను వర్చువల్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన చేసారన్నారు. మహిళా సంఘ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ... జిల్లాలో మహిళలని కోటీశ్వరులుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు.మహిళలు విభిన్న వ్యాపారాలైన పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, గోడౌన్, రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్, క్యాంటీన్లు,మరిన్ని వ్యాపార లక్ష్యాలతో ముందుకు వస్తే భూమి కేటాయించడానికి, లోన్లు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.మహిళలందరూ ముందుకు వస్తే వారికి అన్నీ అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలందరూ వివిధ వ్యాపార భాగస్వామ్యం కోసం ముందుకు వచ్చి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మహిళా సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేసి ,న్యూట్రిషన్ స్టాల్స్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మహిళలు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి

**• ప్రణాళిక లో భాగంగా మహిళల వారోత్సవ కార్యక్రమం**










**కొల్చారం, మే 25,(సిరి న్యూస్)**

మండల కేంద్రమైన కొల్చారంలో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం మహిళల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కొల్చారం గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కిశోర బాలికలకు, తల్లులకు పోషకాహారం గురించి అవగాహన ల్పించారు. గర్భిణీలకు హిమోగ్లోబిన్ టెస్టుల గురించి అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చు తో అధిక పోషక విలువలు కల ఆహారపదార్థాలను తయారు చేసి వారికి చూపించుట జరిగింది. ఇందులో హెల్త్ సిబ్బంది హెల్త్ సూపెర్వైసోర్ మార్త , సెర్ఫ్ , ఐసిడిఎస్ సువర్వైసోర్ . జయంతి, అంగన్వాడీ టీచర్స్, ఉమెన్స్ హబ్ కవిత, తల్లులు, కిషోర బాలికలు, ఆశ, ఏ ఎన్ ఎం లు పాల్గొన్నారు.

## కోటి శ్రీ రుద్ర పారాయణం కు వెళ్తున్న భక్తులు




**కొల్చారం, మే 25,(జనం సాక్షి):**

శ్రీశైలం లో శ్రీ మాధవానంద స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి శ్రీ రుద్ర, శ్రీ సూక్త పారాయణం లో పాల్గొనడానికి వెళ్ళుచున్నట్లు కొల్చారం భక్తబృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలకంటి కండక్టర్ సంగమేశ్వర్ గంగసాని రాజిరెడ్డి తిమ్మన గారి ఆంజనేయులు మురళీధర శర్మ పం తులు ప్రభు లింగం సార్ చోరీ గారి చిన్న రాములు

## రైతులు అధైర్య పడొద్దు. చివరి గింజ వరకు కొంటాం!!!

**వేగంగా అన్లోడింగ్ చేయాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**శివంపేట మే 25 ( సిరి న్యూస్ )**

అత్యంత వేగంగా ధాన్యం అన్లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం శివంపేట మండలం దొంతి గ్రామంలోని కామాక్షి బాయిల్డ్ రైస్ మిల్లు ను సివిల్ సప్లై అధికారులతో కలిసి అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ .. అత్యంత వేగంగా అన్లోడింగ్ ప్రక్రియ జరపాలన్నారు. హమాలీ, రవాణాను సమకూర్చుకొని వేగంగా జరపాలన్నారు.అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద, జగదీష్ తదితరులు ఉన్నారు.

## పెద్ద గోపులారంలో ప్రజాపాలన గ్రామసభ



**మునిపల్లి, మే 25 (సిరి న్యూస్):**

ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక, మహిళా వారోత్సవాలలో భాగంగా మునిపల్లి మండలం పెద్ద గోపులారం గ్రామ సంఘం ఆధ్వర్యంలో జీబీ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బి. మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, ఏపీఎం నర్సిములు, అంగన్‌వాడీ టీచర్, ఆశావర్కర్, సీసీ, వీవోఏ, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## బుధేర–సిరూర్ రోడ్డు పనుల పరిశీలన



**మునిపల్లి, మే 25 (సిరి న్యూస్):**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం బుధేర నుండి సిరూర్ వరకు జరుగుతున్న రోడ్డు పనులను ఈ రోజు నాయకులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మండల అధ్యక్షులు సతీష్ కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విజయ్, సీనియర్ నాయకులు సంగన్న, మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో గృహిణి మృతి

**పాపన్నపేట మే 25 (సిరి న్యూస్) :**



విద్యుత్ షాక్ కు గురై ఓ వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దపూర్ గ్రామానికి చెందిన పోలీసు పార్వతి (35) సోమవారం ఉదయం కూతురు స్యారీ పంక్షన్ ఉండడంతో అల్మరలో ఉన్న బట్టలు తీసుకునేందుకు వెళ్లగా ఆల్మరా పై ఉన్న విద్యుత్ తీగలను ఎలుకలు కొట్టడంతో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై అయి అరవడం తో కుటింబికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మెదక్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలుపడంతో వెంటనే కుటింబికులు పాపన్న పేట పోలుసులకు సమాచారం అందివ్వడంతో పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతురాలి భర్త రవి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**పాపన్నపేట్ మే 25 (సిరి న్యూస్) :**

ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యంప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 25 సంవత్సరాల వయస్సు గల ఓ యువకుడు ఫ్రెంచ్‌కట్ గడ్డంతో, రెండు జతల బట్టలున్న బ్యాగుతో ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనం కోసం వచ్చినట్లు తెలుస్తోంది.అనంతరం చెక్‌డ్యాం వద్ద స్నానం చేయడానికి నీటిలోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగిపోయినట్లు సమాచారం. చెక్‌డ్యాం ఒడ్డున బట్టలు, బ్యాగు కనిపించడంతో అనుమానం చెందిన స్థానికులు వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గజఈతగాళ్ల సహాయంతో నీటిలో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఎలాంటి వివరాలు లభించలేదు.అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మృతుడి ఫోటో ఆధారంగా ఎవరైనా గుర్తిస్తే పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ (87126 57920), మెదక్ రూరల్ సీఐ జార్జ్ (87126 57916)లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# పది రోజులలో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తాం





- **ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..**
- **రైతులు అధైర్య పడొద్దు**
- **సాయి కృష్ణ రైస్ మిల్ ను ఆకస్మికంగా తనిఖీ**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**నర్సాపూర్ మే 25 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సాయి కృష్ణ రైస్ మిల్ ను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్గి ఎం సి ఎస్ జగదీష్ ,డి ఎస్ ఓ నిత్యానంద్ తాహాసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం,కొనుగోలు కేంద్రాలు రైస్ మిల్లర్లు, రవాణా విభాగాల సమన్వయంతో పనిచేస్తున్నాయని రైతుల ఖాతాలకు నగదు వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్–అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాల పరిస్థితుల దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు అవసరాలు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా వేగవంతంగా జరగాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్యాక్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ మే,25(సిరిన్యూస్)**

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలనీ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా 120 పిర్యాదులు స్వీకరించామన్నారు.వాటిలో భూ భారతి 38, పెన్షన్ 19, ఇందిరమ్మ ఇండ్లు కోసం 17, ఇతర 46 మొత్తం 120 పిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పిర్యాదు దారులకు 13 కౌంటర్లు ఏర్పాటు చేసి శాఖల వారిగా దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్,డిఆర్డిఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ మే,25(సిరిన్యూస్)**



జిల్లాలో మత్తు పదార్థాల పై మరింత నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన మత్తు పదార్థాల నిఘా , నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు ఆదేశించారు.జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలు ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పట్టణాల వరకు ప్రజల సహకారంతో సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యానికి, కుటుంబాలకు, సమాజానికి కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువత మంచి మార్గంలో ముందుకు సాగేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో జెడ్పీ సిఈవో ఎల్లయ్య,జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, మత్తు పదార్థాల నియంత్రణ అధికారి చంద్రకళ,డిఎస్పీలు ,పోలీసు, ఎక్సైజ్, విద్య, రవాణా ,వైద్య ,ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అభివృద్ధి మన హక్కు భాగస్వామ్యం మన బాధ్యత

- **జిన్నారం పురపాలిక అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధుల కేటాయింపు..**
- **వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత..**
- **పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**
- **జిన్నారం మున్సిపల్ పరిధిలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

**జిన్నారం మే 25 సిరి న్యూస్**





జిన్నారం మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, రాళ్లకత్వ తండా, సోలక్పల్లి, అండూర్, ఇమామ్ నగర్, ఊట్ల, దాదిగూడెం, మంగంపేట, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూరు, కొర్లకుంట వార్డుల్లో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక పాలకవర్గంతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 75 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రజల నమ్మకంతో ఐదు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి అధికారం అందించారని.. వారి నమ్మకానికి అనుగుణంగా వచ్చే ఐదు సంవత్సరాల పాటు మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పాలకవర్గం సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




### రెండు ఎకరాల్లో ప్రభాస్
# అల్ట్రా లగ్జరీ మ్యాన్షన్?

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ భారీ బడ్జెట్ చిత్రాలతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ ఇండస్ట్రీలో మోస్ట్ బిజీయెస్ట్ హీరోగా దూసుకుపోతున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత కాస్ట్లీ ఏరియాగా పేరుగాంచిన కోకాపేటలో ప్రభాస్ తన సరికొత్త డ్రీం హౌస్ నిర్మించే పనులను అధికారికంగా ప్రారంభించారు.రియల్ ఎస్టేట్ పరంగా హైదరాబాద్‌లోనే టాప్ లొకేషన్‌గా దూసుకుపోతున్న కోకాపేట ఓఆర్ఆర్ (ORR) ఎగ్జిట్ సమీపంలో ప్రభాస్‌కు చెందిన రెండు ఎకరాల భారీ స్థలంలో ఈ నూతన గృహ నిర్మాణం జరుగుతోంది.
ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ స్థలంలో అన్ని రకాల అత్యాధునిక హంగులు, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో కూడిన ఒక 'అల్ట్రా లగ్జరీ మ్యాన్షన్'ను ప్లాన్ చేశారు.ఇంటర్నేషనల్ ఆర్కిటెక్ట్స్ డిజైన్ చేసిన ఈ లగ్జరీ ప్యాలెస్‌లో భారీ హోమ్ థియేటర్, అత్యాధునిక జిమ్నేషియం, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్పోర్ట్స్ ఏరియాతో పాటు ప్రభాస్ సినిమాల సిట్టింగ్స్, కథల చర్చల కోసం ప్రత్యేకంగా ఒక ల్యావిష్ లాంజ్‌ను కూడా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ లొకేషన్‌లో గృహ నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక భూమి పనులు శరవేగంగా సాగుతున్నాయి. షూటింగ్స్ లేని సమయంలో ప్రభాస్ ప్రశాంతంగా గడిపేందుకు, అలాగే ఇండస్ట్రీ ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చేందుకు వీలుగా ఈ అల్ట్రా ప్రైవేట్ ప్రాపర్టీని డెవలప్ చేస్తున్నారు. ఒకవైపు కొత్తింటి పనులు చూసుకుంటూనే.. ప్రభాస్ తన

# అక్షయ్ ఏలియన్ చిత్రం 'సముక్'

ప్రయోగాత్మక చిత్రాలతో అటు అదిరిపోయే యాక్షన్ స్టంట్స్.. ఇటు నవ్వులుపూయించే వైవిధ్యమైన పాత్రలలో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ అగ్ర కథా నాయకుడు అక్షయ్ కుమార్. ఇప్పుడాయన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రంలో భిన్నమైన జానర్‌తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సన్నద్ధమవుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్ కోసం ఆయన 'ది కేరళ స్టోరీ' చిత్రాలను రూపొందించిన నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షాతో చేతులు కలిపారు. వీరిద్దరి కాంబోలో 'సముక్' అనే భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ ముస్తాబవనుంది. ఈ సినిమాకి కనిష్క్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అక్షయ్ ప్రధాన పాత్రలో ఏలియన్ సర్వైవల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రస్తుతం పూర్వ నిర్మాణ దశలో ఉందని త్వరలో సెట్స్ పైకి వెళ్లనుందని చిత్రవర్గాలు తెలిపాయి. పలు హాలీవుడ్ ఫ్రాంచైజీ చిత్రాలలో అనుభవం ఉన్న అంతర్జాతీయ సాంకేతిక బృందాన్ని కూడా ఈ సినిమా కోసం రంగంలోకి దించుతున్నారు. అక్షయ్ మాట్లాడుతూ.. ''సముక్' కథ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఏలియన్ థ్రిల్లర్ అనేది నాకు పూర్తిగా కొత్త జానర్''అని అన్నారు.



# సమంతకు టెన్షన్.. 'జన నాయగన్'తో క్లాష్ తప్పదా?

సమంత స్ట్రెయిట్ తెలుగు సినిమాలో నటించి చాలా కాలమే అయింది. తాజాగా ఆమె దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రంలో ప్రధాన పాత్రలో నటించింది. ఈ సినిమాను జూన్ 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. దీంతో చాలా కాలం తర్వాత తమ అభిమాన హీరోయిన్‌ను వెండితెరపై చూడబోతున్నామంటూ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాకు ఊహించని పోటీ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటిస్తున్న 'జన నాయగన్' సినిమా కూడా జూన్ 19న విడుదలయ్యే అవకాశం ఉందన్న వార్తలు వైరల్ అవుతున్నాయి.
వాస్తవానికి ఈ సినిమా సంక్రాంతి కానుకగా రావాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇక 'జన నాయగన్' సినిమాను తెలుగులో కూడా భారీ స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అదే జరిగితే 'మా ఇంటి బంగారం' చిత్రానికి థియేటర్ల సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. పైగా విజయ్ సినిమాకు భారీ క్రేజ్ ఉండటంతో, హిట్ టాక్ వస్తే సమంత సినిమా కలెక్షన్లపై కూడా ప్రభావం పడొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి సమంత 'జన నాయగన్'తో పోటీ ఏర్పడితే 'మా ఇంటి బంగారం'ను రంగంలోకి దింపుతుందా? లేక వేరే విడుదల తేదీ గురించి ఆలోచిస్తుందా అనేది ఆసక్తిగా మారింది.



# ఆ ఫ్లాప్ సినిమాతో కూడా డబ్బు సంపాదించా..

తెలుగు చిత్ర పరిశ్రమలో నటుడిగా, నిర్మాతగా మంచి గుర్తింపు సంపాదించుకున్న వారిలో బండ్ల గణేష్ ఒకరు. రవితేజ హీరోగా తెరకెక్కిన 'ఆంజనేయులు' సినిమాతో నిర్మాతగా కెరీర్ ప్రారంభించిన ఆయన, అనంతరం 'తీన్ మార్', 'గబ్బర్ సింగ్', 'ఇద్దరమ్మాయిలతో', 'బాద్‌షా', 'టెంపర్', 'గోవిందుడు అందరివాడేలే' వంటి పలు చిత్రాలను నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణ రంగానికి దూరంగా ఉన్న బండ్ల గణేష్, చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాలో కీలక పాత్రలో నటించనున్నట్లు ఇటీవల వెల్లడించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బండ్ల గణేష్ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నా దృష్టిలో ఫ్లాప్ సినిమాతో కూడా డబ్బులు సంపాదించే సత్తా ఉన్నవారే నిర్మాత కావాలి. నేను ఇప్పటివరకు నిర్మించిన ఏ సినిమాతోనూ ఒక్క రూపాయి నష్టపోలేదు. 'గబ్బర్ సింగ్', 'టెంపర్', 'బాద్‌షా', 'గోవిందుడు అందరివాడేలే' వంటి హిట్ సినిమాలతో డబ్బు సంపాదించడం పెద్ద విషయం కాదు. కానీ బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయిన 'తీన్ మార్' సినిమాతో కూడా నేను లాభాలు పొందాను" అని తెలిపారు. అదే ఇంటర్వ్యూలో పవన్ కళ్యాణ్‌తో ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలందరూ గర్వపడేలా ఒక సినిమా నిర్మించి ఆ తర్వాత తన నిర్మాణ సంస్థను మూసివేస్తానని బండ్ల గణేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 'పెద్ది' విడుదలపై టెన్షన్.. చిరంజీవితో ఎగ్జిబిటర్ల కీలక భేటీ

రామ్ చరణ్ హీరోగా.. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో భారీ బడ్జెట్ తెరకెక్కించిన పెద్ది సినిమా మరో 10 రోజుల్లో విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే సినిమా ప్రమోషన్లను చిత్రబృందం వేగవంతం చేయగా.. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. అయితే తెలంగాణ సినిమా విడుదలపై సందిగ్ధత నెలకొంది. ఇకపై సినిమాల విడుదలల్లో తమకు పర్సంటేజిని ఇవ్వాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే.. పెద్ది సినిమా నుంచే దానిని అమలు చేయాలని ఎగ్జిబిటర్లు కోరుతున్నారు. ఈ సినిమా తర్వాత పెద్ద సినిమాలేవీ లేవని, పెద్ది నుంచి పర్సంటేజీ విధానాన్ని అమలు చేస్తే.. తాము కూడా నష్టపోకుండా ఉంటామని ఎగ్జిబిటర్లు చెప్తున్నారు. పర్సంటేజి ఇవ్వకుంటే పెద్ది సినిమా విడుదల కానివ్వమని ఇటీవలే ఎగ్జిబిటర్లు తేల్చి చెప్పిన విషయం తెలిసిందే.
తాజాగా ఈ విషయంపై చర్చించేందుకు మెగాస్టార్ చిరంజీవితో తెలంగాణ ఎగ్జిబిటర్ల బృందం సమావేశమయింది. పర్సంటేజి విధానంలోనే పెద్ది సినిమాను విడుదల చేయాలని చిరంజీవితో చర్చిస్తున్నారు. అలాగే సింగిల్ స్క్రీన్ థియేటర్లు, రెంటల్ విధానంలో తాము చూస్తున్న నష్టాలను గురించి కూడా అసోసియేషన్ చిరంజీవికి వివరించనుంది. ఈ సమావేశానికి ఫిలిం చాంబర్ అధ్యక్షుడు సురేష్ బాబు, కేఎల్ నారాయణ, నిర్మాత దిల్ రాజు హాజరయ్యారు. సమావేశం తర్వాత



చిరంజీవి ఏ నిర్ణయం తీసుకుంటారో, పెద్ది విడుదలకు ఎగ్జిబిటర్లు గ్రీన్ సిగ్నలిస్తారో లేదో చూడాలి.


### రిలీజ్‌కు ముందే నార్త్ అమెరికాలో..
# 'పెద్ది' రికార్డ్ హంగామా..

'ఆర్ఆర్ఆర్' (RRR) చిత్రంతో అంతర్జాతీయంగా భారీ క్రేజ్ సంపాదించుకున్న రామ్ చరణ్ సినిమా కావడంతో.. 'పెద్ది' చిత్రంపై ఓవర్సీస్ (Overseas) మార్కెట్‌లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన 'హెల్లాళ్ళల్లో' ఐటెం సాంగ్.. ఇతర సాంగ్స్ యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుండగా.. ఇప్పుడు అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో 'పెద్ది' బాక్సాఫీస్ వేటను అప్పుడే షురూ చేసింది. తాజా ట్రేడ్ రిపోర్ట్స్ ప్రకారం.. నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోలకు సంబంధించి జరిగిన ప్రీసేల్స్ (PreSales) అప్పుడే $500K (హాఫ్ మిలియన్ డాలర్లు) మార్కును దాటేసి సరికొత్త రికార్డు క్రియేట్ చేశాయి. ప్రీసేల్స్ ట్రెండ్ చూస్తుంటే కేవలం ప్రీమియర్ షోల ద్వారానే ఈ చిత్రం వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చాలా సులువుగా చేరేలా కనిపిస్తోంది. రామ్ చరణ్ మాస్ ఇమేజ్‌కు బుచ్చిబాబు బ్రాండ్ తోడవడంతో యూఎస్ఏ (USA) ఆడియన్స్ ఈ సినిమాను చూసేందుకు ఎగబడుతున్నారు. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ (Janhvi Kapoor) హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్, వర్సటైల్ యాక్టర్ జగపతి బాబు, బాలీవుడ్ నటులు దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ (AR Rahman) అందించిన సాంగ్స్ అన్నీ చార్ట్‌బస్టర్లుగా నిలిచి సినిమాపై హైప్‌ను మరింత పెంచాయి. ముఖ్యంగా శృతి హాసన్ మెరిసిన 'హెల్లాళ్ళల్లో' మాస్ ఆంథెమ్ థియేటర్లలో పూనకాలు తెప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం జూన్ 4న బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతుందో చూడాలి!



# సినిమా టికెట్ల ధరలు పెంచండి.. సీఎంకు విజయ్ రిక్వెస్ట్

కమల్ హాసన్ విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఓ ఓటీటీ ప్లాట్‌ఫారాన్ని ప్రారంభిస్తే అది తమకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ముఖ్య మంత్రి విజయ్‌ను కోరారు. అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన ఓటీటీ ప్లాట్‌ఫారం అభివృద్ధి కూడా అంతే వేగంగా ఉందని, ప్రస్తుతం అది చతికిలపడిందని పేర్కొన్నారు. దీంతో సినిమా వృత్తి అత్యంత గందరగోళంగా ఉందన్నారు. చాలా సంవత్సరాల కిందట సినిమా టికెట్ ధరలను పెంచారని, మిగతా ధరలు పెరిగిన నేపథ్యంలో సినిమా టికెట్ ధరనూ పెంచేందుకు పరిశీలించాలని ఆయన సీఎంను కోరారు.



# జాన్వీ చూపంతా సౌత్‌పైనే.. బాలీవుడ్‌ను పక్కన పెట్టిందా?

శ్రీదేవి, బోనీ కపూర్‌ల ముద్దుల కూతురు జాన్వీ కపూర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. హిందీ సినిమాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించిన జాన్వీ అక్కడ మంచి గుర్తింపు సంపాదించుకున్న తర్వాత సౌత్ సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపించింది. అందులో భాగంగా 'దేవర పార్ట్ 1' చిత్రంతో సౌత్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ మంచి విజయం సాధించడంతో ఆమెకు సౌత్‌లో కూడా మంచి గుర్తింపు లభించింది. తాజాగా ఈమె 'పెద్ది' అనే మరో తెలుగు సినిమాలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా మరికొంత కాలంలో విడుదల కానుంది. ఇక తాజాగా ధ్రువ్ విక్రమ్ హీరోగా తెరకెక్కనున్న ఓ కోలీవుడ్ చిత్రానికి కూడా జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ వార్తతో బాలీవుడ్ కంటే సౌత్ సినిమాలపైనే జాన్వీ ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక జాన్వీ నటించిన 'పెద్ది' సినిమా మంచి విజయం సాధిస్తే ఆమెకు సౌత్ ఇండస్ట్రీ నుంచి మరిన్ని భారీ అవకాశాలు రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

మంగళవారం
26-05-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 143

MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 6

# ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, మే 25 (సిరి న్యూస్): అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.



5



# ఇందిరమ్మ ఇండ్లు పేదలకా? దళారులకా?



## అర్హత ఉన్నా మంజూరు కాని సర్కార్ గూడు

- ఎంత మొరపెట్టుకుంటున్నా కనికరించని అధికారులు
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని వైనం
- ఇదే అదునుగా గ్రామాల్లో పుట్టుకొస్తున్న దళారులు
- ఇల్లు ఇప్పిస్తామంటూ నిరుపేదల నుండి భారీగా డబ్బుల వసూళ్లు
- రేవంత్ సర్కార్ ఆశయానికి తూట్లు
- సంగారెడ్డి జిల్లాలో అందని ద్రాక్షలా సొంతింటి కల

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇండ్లు' పథకం క్షేత్రస్థాయికి వచ్చేసరికి నిరుపేదల పాలిట ఒక అందని ద్రాక్షలా మారుతోంది. సొంతంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి, అసలు నిలువ నీడ లేని అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని రేవంత్ రెడ్డి సర్కార్ పదే పదే చెప్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియ పక్కదారి పడుతోంది. ప్రభుత్వ ఆశయాలు ఎంత గొప్పగా ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో పుట్టుకొచ్చిన దళారుల హలావుడి వెరసి.. నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోంది. కనీసం తలదాచుకోవడానికి సరైన గూడు లేక, అద్దెలు కట్టలేక మగ్గిపోతున్న నిరుపేదలు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల కోసం చాటెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)

6






# కొరడా ఊపినా కదలని అక్రమ నిర్మాణాలు!

- జిహెచ్ఎంసి పరిధిలోనూ కొనసాగుతున్న వివాదం..
- కోర్టు ఆదేశాలు.. ఫైనల్ నోటీసులు.. అయినా ఆగని నిర్మాణాలు!
- మున్సిపాలిటీ నోటీసులు బేఖాతరు..? కొనసాగుతున్న నిర్మాణాలపై ప్రశ్నలు..!
- అప్పుడే కూల్చేయాలన్న అధికారులు.. ఇప్పటికీ కొనసాగుతున్న నిర్మాణాలు..!

తెల్లాపూర్ మున్సిపాలిటీ యాక్షన్

2

# ఆగని అక్రమ షెడ్ల దందా

## నిబంధనలు షెడ్ ఎక్కాయి

- అక్రమార్కుల జేబులు నిండాయి
- అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడేదేన్నడు
- నిబంధనలు గాల్లోకి షెడ్లు నేలలోకి
- జిహెచ్ఎంసి ఆదాయానికి అక్రమ గండి
- అక్రమ షెడ్లకు ఖాళీ స్థలాలు టార్గెట్





అమీన్ పూర్ మే 25 సిరి న్యూస్ అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని చక్రపురి కాలనీ మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న ఖాళీ ప్లాట్లు వివాదస్పద స్థలాలను ఆసరాగా చేసుకొని అక్రమార్కులు కుప్పలు కుప్పలుగా రేకుల షెడ్లను చేపడుతున్నారు. చక్రపురి కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ షెడ్లను నిర్మించి వాటిని స్క్రాప్ గోదాములకు, కమర్షియల్ కిచెన్ల కు కార్ గ్యారేజీలకు మరియు చిన్న తరహా పరిశ్రమలకు అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

4





# కొరడా ఊపినా కదలని అక్రమ నిర్మాణాలు!

## తెల్లాపూర్ మున్సిపాలిటీ యాక్షన్


OFFICE OF THE TELLAPUR MUNICIPAL COUNCIL
SANGAREDDY DISTRICT
FINAL NOTICE

Lr.No. 167 /UC/TPS/MCT/2025 Date : 09-07-2025

Sub: Tellapur Municipality, Sangareddy District – Town Planning Section – Unauthorized construction of Group Housing of G+2 floors in Sy.No. 207/AA/3 situated in Patighanapur village, Patancheru Mandal, Sangareddy District - Tellapur Municipality -Final notice issued – Reg.

Ref: 1) The Status Quo orders granted by the Hon'ble Senior Civil Judge, Sangareddy, I.A. No. 482 of 2025 in O.S. No. 455 of 2025 dated 09-04-2025.
2) Lr.No.167/UC/TPS/MCT/2025 show cause notice Dated 01.07.2025

Whereas, this office has issued a Show Cause notice to show sufficient cause by a statement in writing or by an agent duly authorized by you in this behalf why the below mentioned unauthorized construction of Group Housing of G+2 floors in Sy.No. 207/AA/3 situated in Patighanapur village, Patancheru Mandal, Sangareddy District shall not be removed, altered or pull down. Further, you were directed to submit a reply within (7) days to the undersigned from the date of receipt of this notice, failing which further action will be taken to remove, alter or pull down the unauthorized construction and expenses thereof will be recovered from you/further action will be taken as per due process of law.

Meanwhile, you have [illegible] any reply to the show cause notice vide reference 2nd cited. Further, you are hereby directed to remove the unauthorized construction within (15) days, from the date of receipt of this notice, failing which further action will be taken to remove or pull down the unauthorized construction and expenses thereof will be recovered from you/further action will be taken as per due process of law under Telangana Municipal act 2019.

Issued under RTI Act 2005
Public Information Officer

To,
Mamidi Hanumanth Reddy, 9573545444
R/o Flat No. K-1101, Sy No. 83/1, RaidurgamPanmakta,
Serilingampally, Hyderabad. 500032.

Commissioner
Tellapur Municipality


- జిఎచ్ఎంసి పరిధిలోనూ కొనసాగుతున్న వివాదం..
- కోర్టు ఆదేశాలు.. ఫైనల్ నోటీసులు.. అయినా ఆగని నిర్మాణాలు..!
- మున్సిపాలిటీ నోటీసులు బేఖాతరు..? కొనసాగుతున్న నిర్మాణాలపై ప్రశ్నలు..!
- అప్పుడే కూల్చేయాలన్న అధికారులు.. ఇప్పటికీ కొనసాగుతున్న నిర్మాణాలు..!

రామచంద్రపురం,(పటాన్‌చెరు), మే 25, (సిరి న్యూస్): "చట్టం ఒక వైపు.. నిర్మాణాలు మరో వైపు అన్నట్టుగా" జిఎచ్ఎంసి పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని పాటి గ్రామంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోనే సంబంధిత నిర్మాణాలపై ఫైనల్ నోటీసులు జారీ అయినప్పటికీ, ఇప్పటికీ నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాటి గ్రామంలోని సర్వే నెంబర్ 207/AA/3లో అనుమతులు లేకుండా జీ+2 గ్రూప్ హౌసింగ్ నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలపై అప్పట్లో తెల్లాపూర్ మున్సిపాలిటీ చర్యలు ప్రారంభించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలు సమాచార హక్కు చట్టం-2005 ద్వారా వెలుగులోకి వచ్చాయి. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారులకు జారీ చేసిన అధికారిక నోటీసుల వివరాలు బయటపడ్డాయి.

అధికారుల రికార్డుల ప్రకారం, సదరు స్థలానికి సంబంధించి సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2025 ఏప్రిల్ 9న I.A.No.482 of 2025 in O.S.No.455 of 2025 కేసులో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ అక్కడ నిర్మాణ పనులు కొనసాగినట్లు అప్పట్లోనే అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

దీంతో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం 2025 జూలై 1న Lr.No.167/UC/TPS/MCT/2025 ద్వారా షోకాజ్ నోటీసు జారీ చేసి, వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. స్పందన రాకపోవడంతో అదే ఏడాది జూలై 9న ఫైనల్ నోటీసు జారీ చేస్తూ, 15 రోజుల్లోగా అనధికారిక నిర్మాణాన్ని స్వయంగా తొలగించుకోవాలని హెచ్చరించింది. లేకపోతే తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019 ప్రకారం కూల్చివేత చర్యలు చేపట్టి, అందుకు అయ్యే పూర్తి ఖర్చును కూడా సంబంధిత వ్యక్తుల నుంచే వసూలు చేస్తామని అప్పటి అధికారులు స్పష్టం చేసినట్లు పత్రాల్లో వెల్లడైంది. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతం జిఎచ్ఎంసి పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోకి వచ్చిన తర్వాత కూడా అక్కడ అక్రమ నిర్మాణ కార్యకలాపాలు పూర్తిగా ఆగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఫైనల్ నోటీసులు జారీ చేసిన నిర్మాణాలపైనా ఇప్పటికీ పూర్తి స్థాయి చర్యలు కనిపించకపోవడంతో, అక్రమ నిర్మాణాలపై అధికారుల వైఖరిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


OFFICE OF THE TELLAPUR MUNICIPALITY
SANGAREDDY DISTRICT

Lr.No: 72./RTI/TPS/TEL/2025 Dated: 22.07.2025

Sub:- Tellapur Municipality-Town Planning Section-Information under Right To Information Act 2005 furnished regarding.

Ref: - You are Application under RTI Act Dated: 16-07-2025

***** ***** *****

With reference with subject cited you are seeking the following information under Right Information act 2005, and same is furnished below

| S.No | Information asked | Information furnished |
|---|---|---|
| 1. | Request to provide copy of showcause notice given to Mamidi Hanumanth Reddy,K.Suresh against the illegal construction in sy no. 207/AA/3 in Pati Village | Copy enclosed |

This is for your kind information.

Public Information Officer
Tellapur Municipality

To,
Sri Pati Sivanarayana Murthy,
#8-3-228/678/5, Karmika Nagar,
Yousufguda, Hyderabad-500045,
Telangana, Ph: 9985548114


సిరి
అనుమానాస్పద బిల్డింగ్ పర్మిషన్ల కలకలం!
25 May 2026 - Page 1
epaper.siridaily.com









# సంగారెడ్డిలో జగ్గారెడ్డి 'సైకిల్ విప్లవం'!

- తాజాగా మరో 70 మంది చిన్నారులకు పంపిణీ
- ఆధార్ జిరాక్స్ ఇస్తే చాలు విడతల వారీగా అందజేత
- సంగారెడ్డిలో జోరుగా సాగుతున్న సైకిళ్ల పంపిణీ కార్యక్రమం
- 8 ఏళ్ల లోపు వయసున్న పిల్లల కోసం ప్రత్యేక కార్యాచరణ
- ఇప్పటివరకు నియోజకవర్గంలో మొత్తం 400 సైకిళ్ల పంపిణీ పూర్తి
- రాబోయే ఆదివారం కోసం మరో 156 మందికి టోకెన్లు జారీ.
- పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇస్తామన్న జగ్గారెడ్డి

**సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో చిన్నారుల కోసం చేపట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమం పండుగలా కొనసాగుతోంది. తాజాగా సంగారెడ్డిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మరో 70 మంది చిన్నారులకు జగ్గారెడ్డి స్వహస్తాలతో సైకిళ్లను పంపిణీ చేశారు. ముఖ్యంగా 8 ఏళ్ల లోపు వయసున్న బుజ్జాయిలకు సైకిళ్లు అందించేలా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయడం విశేషం. ఈ సరికొత్త కార్యక్రమంతో సంగారెడ్డిలో ఇప్పటివరకు మొత్తం 400 మంది చిన్నారులకు సైకిళ్ల పంపిణీ విజయవంతంగా పూర్తయింది.**

**-సంగారెడ్డి, సిరి న్యూస్:**

### ఆధార్ జిరాక్స్ ఇస్తే చాలు..

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చిన్నారుల ముఖాల్లో ఆనందం చూడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తమ కార్యాలయంలో కేవలం ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని అందజేసి, పేర్లు నమోదు చేసుకున్న అర్హులైన చిన్నారులందరికీ విడతల వారీగా సైకిళ్లను అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎవరూ కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క చిన్నారికి సైకిల్ అందించి తీరుతామని జగ్గారెడ్డి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

### మరో 156 మందికి వచ్చే ఆదివారం పంపిణీ

సైకిళ్ల పంపిణీ కార్యక్రమ ప్రాంగణానికి భారీగా తరలివచ్చిన లబ్ధిదారులను ఉద్దేశించి జగ్గారెడ్డి మాట్లాడారు. గతంలోనే తమ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకున్న మరో 156 మంది చిన్నారులకు ఈ సందర్భంగా ఆయన టోకెన్లను పంపిణీ చేశారు. ఈ టోకెన్లు పొందిన చిన్నారులందరికీ రాబోయే ఆదివారం రోజున సైకిళ్లను అందజేస్తామని జగ్గారెడ్డి లబ్ధిదారులైన తల్లిదండ్రులకు వివరించారు.

### చిన్నారులతో ముచ్చటిస్తూ సరదాగా

సైకిళ్ల పంపిణీ సందర్భంగా జగ్గారెడ్డి చిన్నారులతో ముచ్చటిస్తూ ఎంతో సరదాగా గడిపారు. సైకిళ్లు అందుకున్న చిన్నారులతో కరచాలనం చేస్తూ, 'హాయ్' చెబుతూ వారితో కలిసిపోయి సందడి చేశారు. జగ్గారెడ్డి తమ పిల్లలతో అంతలా కలిసిపోవడాన్ని చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వినూత్న కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కూన సంతోష్, సుదీప్ మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.







# ఆగని అక్రమ షెడ్ల దందా

## నిబంధనలు షెడ్ ఎక్కాయి



- అక్రమార్కుల జేబులు నిండాయి
- అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడేదేన్నడు
- నిబంధనలు గాల్లోకి షెడ్లు నేలలోకి
- జిహెచ్ఎంసి ఆదాయానికి అక్రమ గండి
- అక్రమ షెడ్లకు ఖాళీ స్థలాలు టార్గెట్

**అమీన్ పూర్ మే 25 సిరి న్యూస్** అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని చక్రపురి కాలనీ మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న ఖాళీ ప్లాట్లు వివాదస్పద స్థలాలను ఆసరాగా చేసుకొని అక్రమార్కులు కుప్పలు కుప్పలుగా రేకుల షెడ్లను చేపడుతున్నారు.

చక్రపురి కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ షెడ్లను నిర్మించి వాటిని స్క్రాప్ గోదాములకు, కమర్షియల్ కిచెన్లకు కార్ గ్యారేజీలకు మరియు చిన్న తరహా పరిశ్రమలకు అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### సెట్ బ్యాక్స్ లేవు ఫైర్ సేఫ్టీ శూన్యం:

హెచ్ఎండిఏ నిబంధనల ప్రకారం చుట్టూ వదలాల్సిన కనీస స్థలం సెట్ బ్యాక్స్ లేకుండా రోడ్లను ఆనుకుని ప్రహరీ గోడల పైనే ఈ షెడ్లను నిర్మిస్తున్నారు.
కనీస అగ్నిమాపక రక్షణ చర్యలు సేఫ్టీ లేకపోవడంతో స్థానిక నివాసితులు ప్రమాదాల ముప్పుతో భయాందోళన మధ్య గడుపుతున్నారు.

### తెలిసినా పట్టించుకోని వైనం:

చక్రపురి కాలనీలో కళ్లెదుటే అక్రమ నిర్మాణాలు జరుగుతున్న స్థానిక జిహెచ్ఎంసి మరియు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### సెలవు దినాల్లో శరవేగం:

శని ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాలను ఆసరాగా చేసుకుని అధికారులు రారనే ధీమతో రాత్రికి రాత్రే ఐరన్ పిల్లర్లు నిలబెట్టి రేకుల పై కప్పులు వేస్తున్నారు.
స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు.

### పన్నుల ఎగవేత:

ఈ భారీ షెడ్లు ఏవి జిహెచ్ఎంసి రికార్డులలో నమోదు కాకపోవడంతో వీటికి ఎలాంటి కమర్షియల్ అసెస్మెంట్ జరగడం లేదు, ఫలితంగా ప్రభుత్వానికి రావలసిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజులు కమర్షియల్ ప్రాపర్టీ ట్యాక్స్ దక్కకుండా పోయి జిహెచ్ఎంసి ఖజానాకు భారీ గండి పడుతుందని స్థానికులు వాపోతున్నారు.

### అక్రమ కనెక్షన్లు:

షెడ్లలో నడిచే వ్యాపారాలకు దొంగ చాటున విద్యుత్ నీటి కనెక్షన్లు వాడుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని దెబ్బతీస్తున్నారు.



### ట్రాఫిక్ సమస్యలు:

- నివాస ప్రాంతాల్లో రోడ్లను అక్రమించి షెడ్లు వేసి కమర్షియల్ వ్యాపారాలు కార్ గ్యారేజీలు స్క్రాప్ గోదాము చేస్తుండడంతో కస్టమర్ల వాహనాలన్నీ రోడ్లపైనే పార్కు చేస్తున్నారు దీంతో స్థానికులకు ట్రాఫిక్ నరకం కనిపిస్తుంది.
- శబ్ద వాయు కాలుష్యం నివాసాల మధ్య అక్రమ షెడ్లలో ఇండస్ట్రియల్ వెల్డింగ్ పనులు చేయడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### జిహెచ్ఎంసి నోటీసులకే పరిమితం:

- ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప కూల్చివేతలు చేపట్టడం లేదు,
- టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ల నిఘాలోపం స్పష్టంగా కనిపిస్తుంది కొన్నిచోట్ల ఫిర్యాదులు వచ్చిన క్షేత్రస్థాయి పరిశీలన జరగడంలేదని విమర్శలు ఉన్నాయి.
- ఇప్పటికైనా తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు ఈ అక్రమ షెడ్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.





# ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, మే 25 (సిరి న్యూస్):** అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసు కుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి మంత్రి సురేఖ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృత వనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు



**గుమ్మడిదల, మే 25 (సిరి న్యూస్):** గుమ్మడిదల మండల పరిధిలోని గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గంగా పటం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మల్లన్న గుడి నుండి గ్రామ చెరువు వరకు స్వామివారి గంగా పటాన్ని భక్తులు భారీగా తరలిస్తూ భజనలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇనుప గొలుసు బోనాలు, స్వామివారి కల్యాణోత్సవం భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచాయి. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించగా, భక్తులు స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించింది. గత రెండు రోజులుగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ వీధులు విద్యుత్ దీపాలతో అలంకరించగా, ఆలయ పరిసరాలు రంగురంగుల తోరణాలతో శోభాయమానంగా మారాయి. చిన్నారుల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు. గ్రామ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జాతర ముగింపు వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.





# అటవీ ప్రాంతాల అభివృద్ధితో పర్యాటక రంగానికి ఊతం

### అమృతవనం, హరిత ద్వారం ఫారెస్ట్ పార్కుల ప్రారంభం రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ

**గుమ్మడిదల, మే 25 (సిరి న్యూస్ ):** అటవీ ప్రాంతాల అభివృద్ధితో పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఊతం పడుతుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. గుమ్మడిదల మండల పరిసర అటవీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే దిశగా ఏర్పాటు చేసిన అమృతవనం ఎకో ఫారెస్ట్ పార్క్, హరిత ద్వారం ఫారెస్ట్ పార్కులను రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ సోమవారం ఘనంగా ప్రారంభించారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అమృతవనం ఎకో ఫారెస్ట్ పార్క్ తో పాటు మండలంలోని మంబాపూర్ అటవీ ప్రాంతంలో అభివృద్ధి చేసిన హరిత ద్వారం ఫారెస్ట్ పార్క్ లను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ అటవీ ప్రాంతాలను సంరక్షించడంతో పాటు ప్రజలకు ప్రకృతి అందాలను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇలాంటి ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గుమ్మడిదల మండలం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అవకాశాలు పెరగడంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించడంలో ఈ పార్కులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట శ్రీనివాస్ గౌడ్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అటవీశాఖ అధికారులు, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య, కౌన్సిలర్లు మాధవి, ప్రమీల, రమేష్, కుమార్ గౌడ్, పటాన్చెరు ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహిళా కమిటీ అధ్యక్షురాలు మౌనిక రెడ్డి, సర్పంచులు విజయ భాస్కర్, మహిపాల్ రెడ్డి, పెంటారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు

### ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోండి

### ఉద్యమనేత పోచమ్మల అశ్విని



**రామాయంపేట , మే 25 (సిరి న్యూస్)** ప్రభుత్వ అధికారుల పైన ప్రజలు నమ్మకం కోల్పోయేటువంటి పనులను చేస్తున్న ప్రజా ప్రతినిధుల పైన చర్యలు తీసుకోవాలని సోమవారం నాడు జేసి నగేష్ కు రామాయంపేటకు చెందిన ఉద్యమ నాయకురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్ ముదిరాజు కోరారు. గత పది రోజులుగా రామాయంపేట లోని ఏ నలుగురు కలిసినా మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నాటకీయ పరిణామాల గురించే మాట్లాడుతున్నారు అని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి జరిగిందా లేదా అనే వివాదాస్పదమైన సమస్యను పరిష్కరించి తప్పు ఎవరు చేసినా ,వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాల్సిన అవసరం ప్రజాప్రతినిధులకు ఏముందని, మున్సిపల్ అధికారులు అవినీతికి పాల్పడితే సంబంధిత ఆధారాలతో ఉన్నతస్థాయి అధికారాలకు ఫిర్యాదు చేయాల్సిన ప్రజాప్రతినిధులే బాధ్యతారహితముగా ఇంతలా దిగజారాల్సిన అవసరం ఏముందని జెసి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆమె తెలిపారు.



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇండ్లు' పథకం క్షేత్రస్థాయికి వచ్చేసరికి నిరుపేదల పాలిట ఒక అందని ద్రాక్షలా మారుతోంది. సొంతంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి, అసలు నిలువ నీడ లేని అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని రేవంత్ రెడ్డి సర్కార్ పదే పదే చెప్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియ పక్కదారి పడుతోంది. ప్రభుత్వ ఆశయాలు ఎంత గొప్పగా ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో పుట్టుకొచ్చిన దళారుల హలావుడి వెరసి.. నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోంది. కనీసం తలదాచుకోవడానికి సరైన గూడు లేక, అద్దెలు కట్టలేక మగ్గిపోతున్న నిరుపేదలు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల కోసం చాటెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)

- ఎంత మొరపెట్టుకుంటున్నా కనికరించని అధికారులు
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని వైనం
- ఇదే అదునుగా గ్రామాల్లో పుట్టుకొస్తున్న దళారులు
- ఇల్లు ఇప్పిస్తామంటూ నిరుపేదల నుండి భారీగా డబ్బుల వసూళ్లు
- రేవంత్ సర్కార్ ఆశయానికి తూట్లు
- సంగారెడ్డి జిల్లాలో అందని ద్రాక్షలా సొంతింటి కల

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకా? దళారులకా?

**అర్హత ఉన్నా మంజూరు కాని సర్కార్ గూడు**

### కాళ్లరిగేలా ప్రదక్షిణలు..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య వేలల్లో ఉంది. అందులో నూటికి నూరు శాతం అర్హత ఉన్న కుటుంబాలు, రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు ఎందరో ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ, శిథిలావస్థకు చేరిన ఇండ్లలో, పూరి గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్న వారు తమకు ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చే అధికారులు మాత్రం లబ్ధిదారుల ఎంపికలో రకరకాల వంకలు పెడుతూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'అన్నీ కాగితాలు సక్రమంగా ఉన్నా, ఇల్లు మంజూరు కావడం లేదు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోతున్నాయే తప్ప అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు' అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజావాణిలో మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం..

సంగారెడ్డి జిల్లా బోరపట్ల గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటికి అర్హులు. కమిటీ సైతం వారిని ఆమోదించింది. అయినా అధికారులు మాత్రం ఇళ్లు మంజూరు చేయడం లేదు. ప్రజావాణిలో సైతం అధికారులతో మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. ఇలా ఇందిరమ్మ ఇళ్లు రాని వందలాది మంది నిరుపేదలు ప్రతి సోమవారం ఆశగా ప్రజావాణి అర్జీలు పట్టుకుని క్యూ కడుతున్నారు. తమ దీన స్థితిని వివరిస్తూ అధికారులకు ఫొటోలతో సహా దరఖాస్తులు ఇస్తున్నారు. కానీ, ఈ ప్రజావాణి దరఖాస్తులపై కూడా క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ కరువైంది. అర్జీలు తీసుకోవడం, వాటిని కంప్యూటర్లలో నమోదు చేయడం తప్ప.. సదరు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి నిజానిజాలు తేల్చి ఇల్లు మంజూరు చేసే నాథుడే కరువయ్యాడు. దీంతో ప్రజావాణికి వెళ్లినా ఫలితం శూన్యంగా మారుతోందని, కేవలం అప్లికేషన్లు ఇవ్వడానికే తమ డబ్బులు, సమయం వృథా అవుతున్నాయని పేదలు వాపోతున్నారు.

### గ్రామాల్లో పుట్టుకొస్తున్న దళారులు..

ప్రభుత్వ పథకాల్లో ఎక్కడ లొసుగులు ఉంటే అక్కడ దళారులు అవతారమెత్తడం సాధారణంగా మారింది. ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కూడా ఇదే దళారుల జబ్బు పట్టుకుంది. గ్రామాల్లో, పట్టణాల్లో కొత్తగా బ్రోకర్ల ముఠాలు తయారయ్యాయి. అధికారులతో మాకు లాలూచీ ఉందంటూ, తాము చెబితేనే లిస్టులో పేరు వస్తుందంటూ అమాయక నిరుపేదలను నమ్మిస్తున్నారు. మీకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తాం.. కానీ అధికారులకు ఇచ్చుకోవాలి.. మాకు ఖర్చు లు కావాలి.. అంటూ ముందస్తుగా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. సొంతింటి కల ఎలాగైనా నెరవేరాలనే తాపత్రయంతో పేదలు సైతం అప్పులు చేసో, ఉన్న ఊరిలో ఉన్నకాడికి అమ్ముకునో ఈ దళారుల చేతుల్లో పెట్టి మోసపోతున్నారు.

### రేవంత్ సర్కార్ ఆశయానికి తూట్లు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా, ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోంది. అవినీతికి తావు లేకుండా, పారదర్శకంగా ఇండ్ల పంపిణీ జరగాలని సీఎం గట్టిగా ఆదేశిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు స్వార్థపరులైన అధికారులు, స్థానిక దళారులు చేతులు కలపడం వల్ల ముఖ్యమంత్రి ఆశయాలకు గండి పడుతోంది. నిజమైన పేదవాడికి న్యాయం జరగకుండా, డబ్బులు ఇచ్చిన వారికే పథకాలు అందుతున్నాయనే చెడ్డపేరు ప్రభుత్వానికి వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిద్ర మత్తు వీడి.. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి. దళారుల ఆట కట్టించి, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించి వారి సొంతింటి కలను నిజం చేయాల్సిన అవసరం ఉంది.

